# నాయుడుపిల్ల

ఈ సంబంధం నీకిష్టమేనా అని మావాళ్ళడిగింది నిజమే. ఒక్కతే కూతుర్ని. నాకు ఇరవై యేళ్ళు వొచ్చాయి. గోషా గనక బయటికి వెళ్ళడానికి వీల్లేదన్నమాటే గాని, ఇంటో పెత్తనమంతా నాదే. డబ్బు నష్టం దెబ్బతిన్న తరువాత నాన్న దూకుడంతా అణిగింది. సగం వెర్రిగా వుండేవాడు. అమ్మకి యెప్పుడూ లేదు బుద్ధిబలం. అందుకని పెళ్ళిసంగతి నన్నడక్క తప్పింది కాదు. అయినా వాళ్ళమనసూ పీకిందనుకుంటా, నన్ను ముసలివాడికియ్యవలిసి వొచ్చిందే అని. ఈయనకి యాభై యేళ్ళు పైగా వుంటాయి.

వొప్పుకోనా వొద్దా అని సందేహం పట్టుకుంది నాకు. పైకి నా ఇష్టమని అన్నారేగాని అమ్మావాళ్లూ, ఆయన వొచ్చి నన్నిమ్మని అడిగేటప్పటికి యెదిగిన కూతురనే మహా దురవస్థలోంచి తప్పించడానికి వొచ్చిన దైవంలాగ కనపడ్డాడు ఆయన వాళ్ళకి. నా అంత అదృష్టవంతురాలు లేదంది అమ్మ. నాలుగుభవంతుల ఇల్లు, గుర్రంబండి, బంగారు సులోచనాల జోడు, వెండి పొడుంకాయ ఇవన్నీ తలుచుకోమంటుంది. అంతకంటె యేం కావాలి! పరజాలు కట్టినా, గుర్రంబండీ యెక్కి తిరగొచ్చును కదా! కిటికీలు మూసినా, ఆ పెద్ద ఇంట్లో వుండొచ్చు కదా! వొంటరిగా అయినా వెండిగిన్నెల్లో కాఫీ తాగొచ్చు కదా! యెవరూ చూసేవారుండకపోయినా, బనారసు చీరెలు కట్టొచ్చు, కాసుల పేర్లేసుకోవొచ్చు. ఇంకేం!

అదిగాక నాన్న చాలా సంతోషిస్తారు. ఆయనకి నాన్న వెయ్యి రూపాయలు బాకీ. కన్యాశుల్కం కింద ఆ ప్రామిసరీనోటు యిచ్చేస్తానన్నాడు. వున్న డబ్బంతా వర్తకమని తగలేసి, సిగ్గుపడి మూల కూచున్న నాన్నని చూస్తే నాకు దిగులేస్తుంది. ఈ ఋణం తీరితే యీ యిల్లన్నా నిలుస్తుంది యీ ముసలాళ్ళకి. లేకపోతే వాళ్ళిద్దరూ పోయింతరువాత నేనేమౌతానా అని నాన్నకి దిగులు. పాపం, డబ్బులేక నాన్న సిగరెట్లు మానుకున్నారు. అమ్మ నగలన్నీ అమ్మేసుకుంది. వాటిని తలచుకుని యేడుస్తో వుంటుంది.

కాని నా ఆలోచనలన్నీ యేమవుతాయి? చిన్నప్పట్నించి నేననుకున్నవన్నీ? యెవరో వీళ్ళందరికంటే గొప్పవాడికి నన్ను పెళ్ళి చేస్తారనీ, అతన్ని చూస్తే నాకెంతో ప్రేమా, గౌరవం వుంటుందనీ. అతను కూడా నన్ను చాలా లాలిస్తాడనీ అనుకునేదాన్ని. ఇంక అతనితో సరసాలూ, సిగ్గులూ, మోహమూ, అన్నీ ప్రతిరాత్రీ ఆలోచించుకునేటప్పటికి నిజంలాగే కనపడేవి. మధ్యాహ్నం భోజనమయిం తరువాత కుర్చీలో నాన్నా, చాప మీద అమ్మా నిద్రపోతూవుంటే కిటికీలో, తడిక వెనకాల పూలు అల్లుకుంటో కూచుని, రోడ్డుమీద వాళ్ళని చూస్తో ఇవన్నీ ఆలోచించుకునే దాన్ని. ఆ తోవని పోయేవాళ్ళల్లో అందంగా నాయుడి కుర్రవాడిలాగా యెవరో కనపడితే, అతనే అనుకుని, చాలా రోజులు అతని రూపమే నా భర్తకింద చూసుకునేదాన్ని. ఇంకొకరు కనపడగానే పాతదిపోయి కొత్తది నా మనసులో ఆ స్థాన మాక్రమించుకునేది. ఎన్ని ఆలోచనలు! పెళ్ళి కాగానే గదిలో నన్ను మొదట చూడడం అంత అందంగా వుంటాననుకోక, నన్ను చూసి భ్రమసిపోవడం, తన చెయ్యి నా భుజంమీద వెయ్యపోవడం, నా వొళ్ళు జల్లుమనడం, నేను తప్పించుకుపోవడం, అతను పట్టుకోడం, నా ఆనందం, మొదటి ముద్దులూ, మోహమూ, అతనికి నేను కావలసి రావటం........ అన్నినీ. అతనికి కూడా నేను కొత్తే! ఆడవాళ్ళే కొత్త, నాకు మొగవాళ్ళు కొత్త అయినట్లు. నేనతనికి యింకో లోకంనించి దిగి వొచ్చిన అప్సరసని. అందరి ఆడవాళ్ళవంటి దాన్ని కాదు ఆయనకి. ఆయన నాకు దేవుడికంటె గొప్ప కాదూ? మరి యిన్ని ఆలోచనలుండేవి.

మరి యీయనో! గుమ్మం పరజాలోంచి చూశా. నెరిసిన జుట్టూ, దవడలూ, మెడా, ముడతలూ, చత్వారంకళ్ళూ, పొట్టిగా, లావుగా, యేం ఆనందముంటుంది యీయనతో? ఈయనకి ముచ్చటలన్నీ యిదివరకే తీరాయి. అంతా పాతే. పొడుంకాయా, పొన్నుకర్రా, అల్పాకా కోటూ, లేవూ? అట్లానే నేనూను – మామూలు అయివుంటా. నేను కావలిసి కాదు. ఏదో ఒక ఆడపిల్ల కావాలి. అంతే. మంచంపోతే మళ్ళీ మంచం చేయించు కోడూ? నేనని యింకెవర్నన్నా పెళ్ళిచేసినా వూరుకుంటాడు. ఏదో ఆడ దయితే చాలు మొహమెట్లా వుంటేనేం? పోనీ, నేనని యింకెవర్నన్నా చేస్తే యింకెవరొప్పుకుంటారు? దౌర్భాగ్యురాల్ని! నాకు తప్పుకొచ్చింది గాని?

అయితే యీ సంబంధం వొదులుకుంటే మళ్ళీ సంబంధం దొరుకు తుందా? అసలు యే మొగుడూ లేకుండా పోతాడేమో? నా ఖర్మ మిట్లా కాలిందిగాని, నా యీడు పిల్లల కెన్నో సంబంధాలొస్తాయి. పార్థసారధే దీనికంతా కారణం. చిన్నప్పుడు మా యిద్దరికీ స్నేహం. నాకు గోషా పెట్టింతరువాత కూడా యింట్లోకి అప్పుడప్పుడు వొచ్చేవాడు. దాంతో మా ఇద్దరి పేర్లూ వీధిగోడలమీద కెక్కాయి. మాఇంటిపక్కన మా జ్ఞాతు లున్నారు. ఏ సంబంధం మా నాన్న నాకు కష్టపడి తీసుకొచ్చినా, ఈ సంగతీ, యింకా అబద్ధాలు కొన్నీ కల్పించి చెప్పి పంపించేశారు. వాళ్ళో గోడలమీద అక్షరాలు చెరిగాయికాని, వాళ్ళ మనసుల్లో చెరగలేదు. పాపం పార్థసారధిని వాళ్ళవాళ్ళు చదువుకని యెక్కడికో పంపిం చేశారు. అదివర కేమీ లేదుగాని, గోడలమీద పేర్లుపడీ, అతను వెళ్ళిపోయిన తరవాత నాకతనిమీద ప్రేమ వొచ్చింది. అతనిమీద కలలు అనేకంకన్నా, ఆలో చించా. ఇప్పటికీ అతనంటే ఆనందంగా వుంటుంది. ఈ సంబంధం వొదులుకుంటే, యింక నాకు పెళ్ళి కాదనుకుంటా. పెళ్ళికాకుండానే నాన్నా, అమ్మా పోతే వొంటరిగా ఈ ఇంట్లో వుండనా? అప్పుకి యిల్లు సరి. ఇంక పిన్నిగారి యింటో చేరాలి. దిక్కులేక ఆ పిన్నిదగ్గిర చేరడంకంటే పెద్యేసి యేళ్ళున్న పదిమంది ముసలివాళ్ళని చేసుకోడం నయం.

కథా నిలయం
143
శ్రీకాకుళం



ఇంతకీ నేను యీయన్ని పెళ్ళి చేసుకుంటేనేం? పిల్లలు, బంధువులు, సంబంధాలు, సుఖాలు అన్నీ వుంటాయి. ఇంకేం? గౌరవం, ప్రతిష్ట, నౌకర్లు అన్నీనీ. లోటేమిటి? ఇంక యెటువచ్చీ ముసలివాడనా? దాని వొక్కదానికోసం, ఇన్ని పోగొట్టుకోనా? నాకు కావలిసిన ప్రేమనీ, ఆనందాన్నీ యివ్వనా? వాటికోసం చూస్తే అసలు యేమీ లేకుండాపోతే?

సరే! వొప్పుకుంటా. అంత పెద్దవాణ్ని చేసుకోడం తెలివయిన పని గాదుగాని, యేం చెయ్యను? పెళ్ళి చేసుకుంటేనేగాని ఆడదానికి గతిలేదు. మరి యితను తప్పితే పెళ్ళి అయే సాధనం లేదు. పెళ్ళి చేసుకోకపోతే నేమో! నా అంతట నేను ఒంటరిగా బతక్కూడదూ, ఇష్టమయినవాడు దొరికిందాకా? మృగాలూ, పక్షులూ, పురుగులూ, మొగాళ్లూ అందరూ స్వతంత్రంగా బతుకుతారు. ఈ మనుష్యుల్లో ఆడదానికి మాత్రం బతకాలంటే పెళ్ళి చేసుకుతీరాలి ఎందుకో?

నిశ్చయించుకున్నా, నాయుడుగారి భార్యని కాబోతున్నా, ఇష్టమొచ్చినట్లు సౌఖ్యపెట్టవొచ్చు దేహాన్ని ఏం? మనసు మాత్రం సౌఖ్యపడకూడదూ? లోకంలో అందరూ ఇంతకంటె యేం సౌఖ్య మనుభవిస్తున్నారు? ఇన్ని సౌఖ్యాలున్నప్పుడు ప్రేమ లేకపోతే మాత్రమేం? యీ పెళ్ళయిన వాళ్ళందరికీ ప్రేమవుందా? దాని సంగతి మరిచేపోతామేమోలే! ఇప్పుడే మరిచిపోతా అవన్నీ. ఆ ఆశలన్నీ పోవాలి. నా యవ్వన మాధుర్యాన్ని తలపుకన్నా రానీను. అవన్నీ దొంగ కలలు. ఇదే నిజం........ యవ్వన సౌఖ్యాలేమిటి? నాలుగేళ్లుంటాయి. తరవాత పోతాయి. చూసుకోవలసింది ముసలితనంలో శాంతి.

## 2

పెళ్ళయి మూడు నెల్లయింది. నా అంత తెలివి తక్కువ మొద్దు లోకంలో లేదు. ఇంత ఘోరమైన పొరపాటు యెవరూ చెయ్యలా. ఇంతవరకు యేదో సౌఖ్యపడతాననుకున్నా, మొద్దయినా, మొగుడొకడుంటే

చాలుననుకున్నా. నేను తవ్వుకున్న పెద్ద గోతిలో నేనే పడ్డా. నేను చేసిన ఈ ఘోరమైన పొరబాటు ఆడవాళ్ళందరికీ వెయ్యి కంఠాలతో చాటించా లనిపిస్తోంది. నా అరుపు విని వొక్కళ్ళన్నా యిలాంటి నరకంనించి తప్పించుకుంటే చాలు. ఈడు కానివాళ్ల పెళ్ళి కూడదని తెలిసి కూడా యీ పని చేశాను. కోర్కె- లోకంలోవున్న ప్రేమనంతా అనుభవిద్దామనీ, చేసు కుంది నాకంటే ముప్పైయేళ్ల పెద్దవాణ్ని. ఆ కోర్కె పోయిందనుకున్నాను. మరిచిపోగలననుకున్నాను. యెంత పిచ్చిదాన్ని. కొంతమందీ నన్నూ, నా హోదాని చూసి వోర్వలేక పోతున్నారు కూడాను.

యెవరితోనూ వొక్కమాట చెప్పలేదు ఈ విషయమై నేను- అమ్మతోకూడా, సిగ్గులేక యేమని చెప్పుకోను? చెప్పుకుంటే మాత్రం యెవరి కర్థమవుతుంది? అర్థమయినా, యెవరేం చేస్తారు? నా పెనిమిటికి తెలిసే తెలీదు. పెళ్ళికి నా ఆత్మ నమ్ముకున్నాను.

మొదట గదిలోకి పంపిన రాత్రి తెల్లారకట్ట మెళుకువ వొచ్చింది. చెవికింద యేదో చప్పుడవుతోంది. చుట్టూ చూశా. నాన్న గదిలో పెద్ద పందిరి పట్టెమంచంమీద, యీ కొత్తాయన పక్కన పడుకుని వున్నా. బయటనించి సన్నగా వెలుతురు లోపల పడుతోంది. దీపం తెలతెల బోతోంది. ఆయన వంకచూశా. లావుగా, పెద్దగా, బొర్ర కనపడుతో వెల్ల కిత్తలగా పడుకుని వున్నారు.మంచం పందిరివేపు నోరు తెరుచుకుని, గురక పెడుతున్నారు. ఆ గురకే నన్ను లేపింది. ముక్కులోంచి వూపిరిపీల్వటం లేదు. గాలిబదులు యేదో నల్లగా కాలవగట్టి, ఆ పొట్టి మీసాల్లోంచి కారు తోంది- ఆ నోరు బాబోయి? కట్టించుకున్న పళ్ళు రాత్రెప్పుడో తీసేశారు. చిగుళ్ళ మొండి తునకలు కనబడుతున్నాయి. చప్పిదవడలు. చొంగ. తలకి చలిటోపి తగిలించారు. ఆ కోతిటోపీ లోంచి మొఖం యేం అందంగా కన పడుతోందని! ముద్దులొలికి పోతోంది. ఆ రొమ్ముమీద వెంత్రుకలు పక్కల్ని గుండ్రంగా గొరిగించాడు! చొక్కా తీసేస్తే అవొళ్ళు ముడతలూ ఆ చంకలు, అమ్మోయి! కళ్ళు మూసుకున్నా.

(8)

దీన్నా నేను కోరి కోరి చేసుకున్నది? ఇంకా యెంతకాలం బతుకుంది?........

రాత్రి పలహారాలూ, తమలపాకుల తొడిమలూ, నన్ను వెక్కిరిస్తున్నట్లున్నాయి. ఇదా నా పెళ్ళి? రాత్రి పడుకోబోయే ముందు యింత అసహ్యం వెయ్యలేదు............ మెళ్ళో చూసుకున్నా. ఆయన కట్టిన బంగారు గొలుసు వేపు. నావొళ్ళు సున్నగా రక్తం చిమ్మి, మెరుస్తోంది. ఆ వొళ్ళు? ఇంక నాకు సౌఖ్యమేమిటి? సంతోషమేమిటి? నన్ను చూస్తే నాకే జాలేసింది. బతికివున్నన్నాళ్లూ ఈయనతో యేం చేస్తో వుంటా?

చిన్నపెళ్ళాం, నా కొత్త అందం, ఇవి నాయుడుగారికి నవయవ్వనమిచ్చాయి కొత్తలో వొకవారం. కాని ఆరిపోయే దీప మెంతసేపు వెలుగుతుంది? ఒకసారి భగ్గుమంది. అంతేకాని నాలో వెలుగుకి శాంతియేది? అప్పుడే మొదలయ్యేను నాకు యవ్వనం. మోహం, బలం కావాలి. ఈయన బండీ, మేడా, భోజనం ఇస్తాడు. వీటిల్లో అవి మరిచి పోతాననుకున్నాను. కాని ఇవన్నీ వాటిని యెక్కువ చెయ్యటం మొదలు పెట్టాయి. అణపరాని వేదన ప్రారంభించింది. కాని ఆయన్నిచూసి నిరాశలో చచ్చిపోతోంది.

## 3

ముసలాయన పనులు శ్రద్ధతో చేస్తున్నా. స్వయంగా దగ్గిరకూచుని వొడ్డిస్తా. బట్టలూ, అన్నీ సిద్ధంగా వుంచుతా. ముసలితనంలో ఆయనకి విసుకులేకండా అన్నీ తయారుగా వుంచుతున్నాను. ఇదంతాచూసి ఆయనకి నామీద చాలాదయ. అందరితోనూ నా సంగతి గర్వంగా చెప్పుకుంటారు. నే నడిగిందల్లా ఆ రోజే తెచ్చిపెడతారు. యెన్నో కొత్తనగలు చేయించారు. అయితే యేం లాభం? మా నాన్నగారికి డబ్బుంటే నాకివన్నీ చేసేవారు కాదూ? అంతే. ఏం భేధంలేదు. యెందుకీ భోగాలన్నీ? వొక్కరవ్వ గాఢమైన మోహంకోసం, తిండిలేకుండా మాడమంటే మాడతాను.

అయిన పెళ్ళి ఏదో అయిపోయింది? వూరికే దిగులుపడీ, ఎన్నటికీ సంభవించని వాటికోసం ఆశపడీ, వుత్త బాధేకాని ఏం లాభం? అని మనసునీ గుండెనీ రాయిచేసుకుని ఆయన్ని సంతోష పెట్టాలని చూశాను. కాని లాభంలేదు. నా నరాలు పీక్కుపోతున్నాయి. నాకు పిచ్చి ఎత్తేట్టుంది. చివరికి మొగ నౌకర్లని చూసినా నా మనసు నిలవటంలేదు. ఏ నిమిషాన ఏం పాడుపని చేసేస్తానో అని భయంగా వుంది. నాకేనా ఇట్లా? నావంటి నిర్భాగ్యుల కందరికీ ఇంతేనా? నేనే దుర్మార్గురాలినా? నా రక్తంలోనే ఈ నీచత్వం వుందా? చచ్చిన వాళ్ళకోసం ఏడిస్తే వొస్తారా? అట్లానే మండిపోయిన యివ్వనం కోసం పెనుగులాడితే ఏమన్నా లాభం వుంటుందా అని యెంత చెప్పుకున్నా, రాత్రింబవళ్ళు ఏం చేస్తున్నా, అదే ధ్యాస అయిపోయింది. చివరికి ఈగల్నీ, పిచికల్నీ చూసికూడా ఈర్ష్యపుడుతోంది. బిగ్గిరిగా అరవాలనీ, గాలిని కావిలించుకోవాలనీ మతి తప్పుతుంది.

నాకీ యింటోంచి పారిపోవాలని వుంది. కాని యెక్కడికి? నాన్న రానీడు, అప్పుకూడా తీరిందా! నాయిడుగారికి కోపం రానీడు యేమైపోను? ఇవన్నీ వొదిలిపెట్టాలే! వేళకి భోజనం, ఆవు పెరుగూ, మాంసం కూరా, చీనా పట్టుచీరలూ, అగరునూనా, వెండిగిన్నెలూ, గడియారం గొలుసూ, మాటలేనా! యివన్నీ అనుభవించేటంత అదృష్టం పట్టడం? వీటిని చేతులారా వొదులుకోనా? పట్టుపరుపూ, తెల్లని దుప్పట్లూ మాటలా?

ఈ భోజనంతో రోజురోజూ దిట్టంగా లావెక్కుతున్నాను. తిండీ పనేమీ లేదు. లావుగాక యేం చేస్తాను? ఈ భోజనం వొదులుకోగలనా? కాని నాకిక్కడుండాలని లేదు. పోపడానికి వీలుంటే బావుండును. ఆడపిల్లల్ని నిరాధారంగా మొగుళ్ళమీద పారేసి వూరుకోడం యెంత అన్యాయం? యేంచేసినా తప్పించుకోడ మెట్లా? తప్పించుకోకూడదనే వీళ్ళ అభిప్రాయం. తప్పించుకుంటే ఈ ముసలాళ్ళకి చిన్నపెళ్ళాలెట్లా దొరుకుతారు? అందులో ఈ ఘోషా, రోడ్డుమీద యెట్లా నడుస్తారో కూడా మరిచి పోయినానుకదా! ఈ రోడ్డు దాటితే అడివో, కొండలో తెలీదు. అడివెట్లా వుంటుంది? నాకు యేదన్నా చేసి సంపాయించుకోడమే చాతయితే, ఈ

ఏడుపు వుండదుకదా? ఇట్లా బలవంతంగా రెక్కలు కట్టి ఈ ఘోషా పంజరాల్లో పెట్టి మేతకోసం ఈ మొగాళ్ళ కందిస్తారు. వూరికే సంస్కరణాలు మాట్లాడతారు ఈ దేశభక్తులు. స్వతంత్రంగా బతకడానికి వీల్లేదూ? మాకు వోట్లుట? ఇంత బతుకు తెరువు లేకేకదూ యెంత తొందరగా వీలయితే అంత తొందరగా యెవరికో వొకరికి మమ్మల్ని కట్టెయ్యడం?

పిల్లలన్నా వుంటే ఇంత దుర్భరంగా వుండదేమో బతుకు! కాని పిల్లల ఆశలేదని మొదటిరాత్రే తెలిసింది. పెళ్ళి చేసుకునికూడా గొడ్రాల్ని కావలిసిందే? ఇట్లాంటి భర్తవుంటే వున్నాడు, పిల్లలుండ కూడదూ? పిల్లల కోసం పరితపిస్తో, ఈ మండే కోర్కెతో నా బతుకంతా ఇట్లా వుండవలిసిందేనా? ఆ పోట్లావుకి దూడవుంది. ఆ కుంటికోడికి ఆరు పిల్లలున్నాయి. మా యింటో పనిచేసే యానాదిదానికి పదిమంది పిల్లలు. బిడ్డ బిడ్డ అని ఆ చిన్ని చేతులకోసం, ఆ తడుముకునే నోరుకోసం, కలవరించే నాకేనా బిడ్డ లేనిది? ఇట్లాంటి ముసలి మొగుణ్ని దగ్గిరన్నా చేరనిస్తాయా ఆ జంతువులు? ఆ జంతువులకంటే అధమ మయిందే నా బతుకు! అవి సృష్టి కార్యాన్ని నెరవేరుస్తున్నాయి. కాని నేనో! నీళ్ళ గదిలో నా వొళ్ళు చూసుకుంటా. ఎప్పుడూ నా సౌందర్యపు వొంపులూ, ఆ బలం, కండలు, లోకాన్ని నవ్వులతో నింపే బిడ్డల తల్లిని కావడానికికదూ నన్ను సృష్టి ఏర్పరచింది; పెంచింది; ఈ అణచలేని కోర్కె నిచ్చింది? కాని సంఘం, ఈ కులం ఈ వివాహచట్టం, యేరి యేరి ఈ ముసలి నిచ్చాయి. సృష్టి ఆగదు. సంఘం ఆగదు. ఈ కాల్చే కోర్కె ఆగదు. లోలోపల దగ్ధమై నశించేది నేనే. నన్ను తాకడం, నాదగ్గిర నించి పాలు తాగడం, ఎంత ఇష్టంగా వుంటుంది నా పిల్లలికి? మొదటామెకీ బిడ్డలు లేరు. మా ఇద్దరిదీనా తప్పు? పాపం ఆమెకూడా నాకు మల్లేనే బిడ్డలకోసం ఏడ్చి ఏడ్చి అట్లానే పోయింది గావును?

అయ్యో చిన్నవాణ్ణి యెవరినన్నా చేసుకునివుంటే ఎంత బావుండును? చిన్నప్పుడు పార్థసారథితో మాట్లాడినందుకు కాదూ? సంఘం నామీద నిందలుమోపి, ఈ ముసలాయనతప్ప గతిలేకండా చేసింది? మళ్ళీ

పైగా నిన్నెవరు ఈ ముసలాణ్ణి చేసుకోమన్నారని ఎదురుతిరిగి అడిగేదీ పిశ్చే. నా కర్మంటారు పైపెచ్చు. అంతా వీళ్లుచేసి, స్వర్గ మొస్తుందిలే, చచ్చింతరవాత అని వోదారుస్తారు. ఎందు కా స్వర్గం యాదవను? ఆ స్వర్గం కోసం వీళ్ళందరూ ముసలాళ్ళని కట్టుకోరేం?

## 4

క్రిమంగా మారిపోతున్నాను. నా ప్రేమా, దయా మాయమవుతున్నాయి. కఠినత్వం, చిరాకూ అలవాటవుతున్నాయి. నేనిట్లా బాధ పడుతో యింకొకరికి దయ యేం చూపించను? పడుచు మొగుళ్ళున్న వాళ్ళనీ చక్కని బిడ్డలున్న వాళ్ళనీ, ఎవరిని చూసినా నాకు వొళ్ళు మండి పోతోంది.

ఈ యెండాకాలం ఎంత వేడిగా వుంది! రాత్రులుకూడా ఒకటే ఉక్క. నిద్రరాదు. ఆయన నన్నుకూడ తనతో గదిలోనే పడుకో మంటారు. బయట పడుకుంటే ఎవరన్నా గోడెక్కి నన్ను చూస్తారన్న భయం ఆయనకి. డాబామీద పడుకుంటే పక్క మేడమీదివాళ్ళు చూస్తారన్న భయం, అంత లావున్న ఆయనకి వుక్కపొయ్యదుగావును? హాయిగా నిద్ర పోతారు. అయితే పనిచేసి అలిసి ఒస్తారు. అదిగాక నల్లమందు అలవాటని కూడా నాకు అనుమానం. ఆహా! యిల్లాంటి రాత్రులు చెయ్యి చెయ్యి పట్టుకుని యెవరన్నా చిన్నవాడితో ఈ బయట తోటలో తిరుగుతోవుంటే ఎంత బావుంటుంది! ఈ నాయుడుగారు తొమ్మిదింటికే పందిమల్లే పడి గుర్రు కొడతారు. ఒంటిగంట కొట్టినా నాకు నిద్రరాదు. మేలుకుంటే మాత్రం ఈయనతో షికార్లు! షికార్లే!

అదిగో? ఆ మూల పక్కమీద పడివుంది మాంస పర్వతం. గుర్రు కొడుతోంది. ఆ గుర్రు వింటేనే నా నరాలు మండిపోతాయి. చేతికేం దొరికితే అది నెత్తిన విసిరెయ్యాలనిపిస్తుంది. చెంబెడు నీళ్లుపోస్తే ఆ గురక ఆగేట్టు! అంతే, తెల్లవారిందాకా అంతే! ఒకటే నిద్ర. ఇల్లు తగలబడు

తున్నా, భూమి బద్దలవుతున్నా మెలుకువ రాదు...... ఎన్నాళ్ళని ఇట్లా సహించి వుండడం? ఇంకా ఎంతకాలం బతుకుతాడో ఈ ముసలాయన? పిల్లలు లేకపోతే పీడాబాయిరి, ఈ శవన్నా ఒదిలితే! ఈ మంచంమీది నించి!......పాపం, నామీద ఇంత దయ చూపిస్తోవుంటే, ఏం చేశారని ఈయన్ని ఈ తిట్లు! ఎంత చెడ్డదాన్నవుతున్నాను? కాని ఈయనిట్లా బతుకుతోనే వుంటే!

చచ్చిపోనా! ధైర్యముంటుందా? అమ్మా? ఇంత జీవనశక్తినీ, మాతృప్రేమనీ, సౌందర్యాన్నీ, ఈ జీవన మాధుర్యాన్నీ, ఆ నీళ్ళ కప్ప చెప్పనా?.........ఎందుకు పోయినా ననుకుంటారు? పిచ్చి అంటారు. ఎవరికన్నా అర్థమవుతుందా? ఇట్లాంటి బాధపడ్డవారికి తప్ప?

బిడ్డలుంటే ఇంత బాధవుండదు. ఆ ఆశ లేదుగా! పోనీ ఎవరికన్నా కంటే ఎవరున్నారు? ఈ మొహం తప్ప ఇంకోటి కనబడితేనా? తప్పా? పాపమా? ఏం తప్పు? నాదేం తప్పు? ఈయన్ని కనొద్దన్నానా? ఆడదాన్ని. ఇంత బలం, అందం, ఆరోగ్యం, మాతృప్రేమ వున్నదాన్ని. బిడ్డలు కనడం నా జన్మ హక్కు కాదూ? సృష్టిలో ఏ ఆడ జంతువన్నా కనకుండా వుంటుందా? ఈయన మూలాన నా హక్కుని నేను ఒదులుకుని ఎందుకు బాధపడాలి? పోనీ! ఈయనమీద నాకు ప్రేమ వుంటే అనుకోవచ్చు. ఆ ప్రేమకోసం, బిడ్డలు లేకపోతే పోనీ, యింకొకరికి నా దేహమిస్తానా అని సందేహించవచ్చు. నాకూ, ఈయనకీ సంబంధం ఏమిటీ? నా భర్త ఎట్లా అయినాడు? నన్ను తల్లినన్నా చెయ్యలేనివాడు, నాకు గర్భాన్ని దానం చెయ్యలేనివాడు నా భర్తేమిటి? ప్రేమా లేదూ? బిడ్డలా లేరు? ప్రేమించదానికి భర్తా లేక, బిడ్డలా లేక ఎందుకు బతకడం? ఈయన్నే ప్రేమించాలంటారు. దైవంగా చూచుకోవాలిట! ఎవరో ఆ మాట పుట్టించింది? ఎవరో ఎందుకూ పనికిరాని ముసలి మొగుడే! ఇదిగో ఈ గురకపెట్టే, పొడుం సీసా కారే, పళ్ళులేని ఈ బోశాయిన్ని చూసి, వీడేం దైవమంటే! వాళ్ళ నిజం దైవాలు ఇట్లానే వుంటారుగావును? దైవంగా చూసుకోవాలిట! ఆ మూల గుళ్ళోవున్న శిల ఎంత దైవమో! ఈయనా అంతే. ఇద్దరూవున్నారు

లావుగా అపుతారాలు. ఎందుకు?.........నాకు చిన్నవాడే భర్త అయితేనా? దైవమా, దైవాతి దైవాన్ని చేసుకునేదాన్ని కాదూ? ఆ కాళ్ళని కళ్ల కద్దుకుని, నా జుట్టుతో పాదాలని తుడిచేదాన్ని. అంత అదృష్టమే వుంటే యింకేం కావాలి? పెళ్ళి చేసుకోడమే దైవాన్ని పెళ్ళి చేసుకోవాలిగాని, ఈ ముసలి తొక్కుని దైవం చేసుకోడమెట్లా? ఈయన్ని దైవమన్న తరవాత నిజమైన దైవాన్ని చూసినా, పరమ అసహ్యం పుడుతుంది.

ప్రతిరోజూ రాత్రీ యింతే. తొమ్మిదింటికల్లా అందరూ వెళ్ళిపోతారు. మేమిద్దరమే యింటికల్లా. ఆయన నిద్రపోగానే ఈ వరండాలో బయట యిటూ అటూ తిరుగుతోవుంటా, నా ఉద్రేకాలతో బాధపడుతో...

# 5

నిన్న రాత్రి తమాషా అయింది. నేను కలలోనన్నా అనుకోలా. నా కంత అదృష్టమొస్తుందని. విచ్చిన బొడ్డు మల్లెల వాసనేస్తోంది. పైరుగాలి తిరిగింది. హృదయారాటం ఎక్కువయింది........నా వెనక ఎవరో నుంచున్నారు చీకట్లో. భయం వేసింది.

"నాన్నమ్మా!"

కలలో జరిగిన సంగతేదో మళ్ళీ జ్ఞాపకమొచ్చినట్లుంది.

"పార్థసారథీ!"

పుక్కపల్లి రెవికన్నా వేసుకోలేదు. నన్ను యినపకమ్ములవంటి చేతులతో బిగించి, ముద్దుపెట్టుకున్నాడు. ఆహా! యెన్నేళ్ల మట్టి కలలు కంటున్నా అట్లాంటి ముద్దులకోసం? ఏమేమిటో గారాబపు మాటలన్నాడు... యింక నాకేమక్కర్లేదనిపించింది లోకంలో. జన్మమంతా ప్రేమలేకుండా గడపవలసివచ్చినా దిగులులేదు. అనుభవించాను. నాశనములేని ఆ నిమిషాన్ని. సంఘం, నీతీ, పతివ్రతలూ, నాయుడుగారూ ఎవ్వరూ, ఈ నిమిషాన్ని నా దగ్గిర్నించి లాక్కోలేరుకదా?............అరిటితోటలోకి తీసికెళ్ళా. చివరికి నా చిన్ని ప్రియుడితో తోటలో చెయ్యీ చెయ్యీ కలిపి నడి

దాను. నా కలలన్నీ నిజమైనాయి. ఆ ముద్దులతో నా ముసలితనమంతా పోయింది. ఆ కోపం ముడతలు కరిగిపోయినాయి. తోటలో గచ్చు అరుగు మీద నా పార్థసారథి చేతులమధ్య పడుకున్నాను ముద్దులతో అలిసిపోయి. అట్లానే పడుకుని నా చెవులో తన సంగతంతా చెప్పాడు. ఇంటరుమీడియెటు పరీక్ష తప్పి కలకత్తా వెళ్ళాడు. అక్కడ చదువుతో నాన్ కో ఆపరేషన్ చేసి, యింటికి వొచ్చాడు రాగానే నాకోసం వెతికాడు. ఇన్నాళ్ళూ నన్ను మరిచిపోనేలేదుట. నాకు పెళ్ళయిందని తెలీగానే గుండెల్లో రాయిపడ్డది. బతుకుమీద ఆశేపోయింది. ఎందుకోగాని నేను తనని మరిచిపోలేదనీ, ఈ ముసలాయనతో సౌఖ్యంగా వుండననీ, తనని చూడగానే ప్రేమిస్తానని నమ్మకం పుట్టింది. వారంనించి నా యిల్లు కనిపెట్టి వున్నాడు; రెండు రాత్రులు వరసగా నేనిట్లాతిరగడంచూశాడు. ఈవాళ ధైర్యంచేసి గోడదూకి ఒచ్చాడు.... నేను యెప్పటికీ తనదాన్నే నన్నాడు. ప్రేమవుంటే ఈ పెళ్ళి అడ్డమా! తననిట్లా కలుసుకోడం తప్పేకాదని రూఢిపరిచాడు. అట్లా సమాధానం చెబుతోవుంటే నాకెంతో బావుంది.

## 6

ప్రతిరోజు రాత్రి వొస్తున్నాడు. చీకట్లో ఇద్దరం కలుసుకుంటాము. ముందుసంగతి యేమన్నా కానీ, యిప్పటికి ఆనందంగా వున్నాం. మా కంతే చాలు....నేనూ చాలా టక్కులు నేర్చుకుంటున్నాను. ముందు ఆయన పక్కన నిద్రపోయినట్టే పడుకుంటా పైగా గురకవల్ల నాకు నిద్రపట్టటం లేదని ఆయనతో చెప్పా. ఒకవేళ ఆయన మెలుకువ వొచ్చి నేను కనబడక యెక్కడికి వెళ్ళావని అడిగినా, నిద్రపట్టక వరండాలోకి వెళ్లానవొచ్చు. అట్లా వెడుతో వుంటానని కూడా అన్నా. ఆయన అక్కడ వెతికితే తోట లోకి వెళ్ళానంటా. కాని ఆయన అసలు లేవరుగా? భయమేంలేదు. మోనం

చెయ్యడమెట్లానో ప్రేమ నేర్పుతోంది నాకు. చాలామంది ఆడవాళ్ళకి ప్రేమ నేర్పుతుంది మోసమంతా. అయినా మోసమేమిటి? అసలు ఈ ముసలాయనకీ నాకూ సంబంధమేమిటి? యెప్పుడూ చిన్నప్పట్ణించీ నా ప్రేమంతా పార్థసారథి మీదనే అయ్యేను

# 7

నిన్న రాత్రి నేను వెళ్ళేటప్పటికే తోటలో వున్నాడు పార్థసారథి. తోటలోంచి గడ్డివాము దొడ్డిలోకి తీసుకెళ్ళా. జనపకట్టెలు తియ్యని వాసన వేస్తున్నాయి. వాటిమధ్య నుంచున్నాము. లోకాన్నే మరిచిపోయినాం. పార్థసారథి గడ్డివాము మీదకెక్కి నాకు చెయ్యందిచ్చాడు. ఇద్దరం చుట్ట చుట్టుకుని దానిమీదపడ్డాం. కింద మెత్తని కొత్తగడ్డి. పైన నిర్మలమైన ఆకాశం. మమ్మల్ని మెల్లిగా కదిలిస్తున్న యెండాకాలపు రాత్రి గాలి! యింక యేం కావాలి! ఆకాశంతప్ప యింకేం కనపట్టంలేదు. ఆ నక్షత్రాల మధ్య వున్నట్టే వుంది. నల్లనిచీకటి కప్పేసింది మా యిద్దరినీ యెవరూ చూడకుండా. ఆ మహానక్షత్ర మండలములో భూమీ, సంసారం, పెళ్ళీ, నీతీ అన్నీ మాయమైనాయి. అంతెత్తునించి ఇవేం కనపడతాయి? మా గాఢమైన ప్రేమ ఆ కాంతికంటె వెలుగయింది. కొట్టుకునే మా హృదయాలు, ఆ నక్షత్రాలకంటె గంభీరమైనవి. ఆ మహానిర్జీవమైన లోకానికంతా మేమిద్దరమే. హృదయం హృదయానికెదురు కొట్టుకుంది. రాత్రి జీవన నాదాలతో కొట్టుకుంటోంది. నేను నాయుడుగారి భార్యనికాదు అప్పుడు. నాన్నమ్మని కాదు. స్త్రీని. లోకంలోవున్న ప్రేమశక్తులన్నిటిలోనూ వొకటయి నా ప్రియుడితో మహా ఆకాశంలో విహారం సలిపే స్త్రీ శక్తిని........ యింకా దగ్గిరిగా నా యింద్రియాలు జ్ఞానం తప్పేట్లు, యింకా దగ్గిరిగా చేర్చుకున్నాడు. ఆహా! యెంత కాంతి వొచ్చింది నాకా రాత్రి!

నేను బతికిన కాలమంతా ఆ రాత్రి కోసం బతికాను. నా ముసలితనం, చీదరా, విచారం అన్నీ వొదిలిపోయినాయి ఆ రాత్రితో! ఆ మహా ప్రేమలో పవిత్రమయింది నా దేహం. మానవులకి కూడా యింత సౌఖ్యముంటుందా ఈ లోకంలో! అనిపించింది ఇప్పటికి నా అందం వుపయోగించింది. ఇంకొకరి కానందం ఇచ్చింది. నాకు మహా ఆనందాన్ని తీసుకొచ్చింది. ఆ ముసలాయనకి నేనైతేనేం యెవరైతేనేం?కాని నా పార్థసారధి నా కోసమే వొచ్చాడు. నేనే కావాలి అతనికి-నా అందమే కావాలి.......

.......చీకట్లో కూడా పార్థ కళ్లు ఆనందంతో మిణుగురు పురుగుల్లాగు మెరుస్తో కనపడ్డాయి. చేతులు చేతులు పెనవేసి నిద్రపోయినాము. మధురమైన నిద్ర మా ఇద్దరి కళ్ళనీ కలిపి ముద్దు పెట్టుకోడానికి వొచ్చిన నిద్ర...తూర్పునించి తెల్లనికాంతి వొచ్చి లేపింది. తెల్లారకట్టే కోవెల లెమ్మని కూసింది. వొద్దని చల్లని పైరుగాలి వీచింది. కష్టంమీద లేచి వెళ్ళిపోయినాము. ఇంట్లోకి వెళ్ళడం కైదులాగుంది. ఇంట్లో యేది చూసినా అసహ్యమే.......

......కోయిలెందుకు అంత చక్కగా అరిచిందో తెలిసింది నాకు. ఆకాశం వేపు చూస్తో చెట్టుమీద గూట్లో నాకుమల్లే ప్రేమననుభవించింది గనకనే ఆ సంతోషం....

## 8

అందరూ ఇట్లాంటి యెండలెప్పుడూ చూడలేదంటున్నారు. వాన కురపదేమంటారు. కాని నాకుమాత్రం ఈ వేడి చాలా బావుంది. వానవొద్దు. గడ్డిమేటిమీద పడుకోడానికి వీలుండదు. పగలెంత వేడయితేనేం రాత్రట్లాంటి గాలి వొచ్చేటప్పుడు?....మనుష్యులు రాత్రులెందుకు నిద్రపోతారో యిప్పుడు తెలుస్తోంది నాకు రాత్రుల అందం నా నిద్రంతా పగలే. ఈ వేడివల్ల నిద్రపోతున్నా ననుకుంటున్నాడీయన.

నేను చేసేది నీతి కాదంటుంది పుణ్యలోకమంతా. కాని ఆ పిచ్చి అభిప్రాయాలూ, మూఢత్వం వొదిలేశా. నక్షత్రాలన్నాయి నేను చేసేది తప్పుకాదని. ఈ ప్రజల్తో లెఖ్ఖా నాకు! సప్తమహాఋషులు చూశారు నేననుభవించే మహాసౌఖ్యాన్ని. వాళ్ళు తప్పులేదన్నారు. నాకింకేం భయం? మహాపతివ్రత అరుంధతి నన్నర్థం చేసుకుంది. ఇంత శాంతినీ—సౌఖ్యాన్నీ ఇస్తున్న ఈ ప్రేమ దుర్నీతా? ఆ వుక్కపోసే గదిలో, చెమటలో, ఆ మహా మాంసఖండాన్ని కావిలించుకోడం నీతా? కావిలించుకున్నా అది కదలదుగా? ఆ కదలకపోవడం, కదలడానికి శక్తి లేకపోవడం, శక్తిలేదని తెలిసికూడా పెళ్ళి చేసుకోవడం, పెళ్ళిచేసుకున్నా, కదలకండా నన్నుకూడా ఆ గదిలో కావిలించుకు పడుకోమనడం పాపంకాదూ? పాపం కాదన్నవాళ్ళు ఒకరాత్రంతా ఆయన్ని కావిలించుకుని పడుకోండి తెలుస్తుంది........నా హృదయం సంగీతాలు పాడుతోంది. నా ప్రతినాడీ ఆనందంతో తాళం వేస్తోంది. దీన్ని వొదులుకుంటానా? మీరు దుర్నీతి అన్నారని భయపడినా స్వర్గాన్ని నేను వదులుకుంటానా? యేం పాతగాకా, భయపడి యేడ్చేవాళ్ళ దగ్గిరికి పొండి, ఈ నీతి అధికారాలు చలాయించడానికి. నాతో కలిసి నక్షత్రమండలం అందుకున్న నా పార్థసారధి దాన్ని నేను, మీకు అర్థం కాకపోతే యాడవండి. మేమేగదా నీతిపరులమని కులకకండి. ప్రేమకి బదులు లోకంలో ఇంకేమన్నా సంపాయించకలరా? తక్కువవాటి కోసం ప్రేమని వొదులుకునేవాళ్ళని చూస్తే నాకు దిగులేస్తుంది. బంగారాన్ని వొదిలి, నీతి రాళ్ళతో నింపుకుంటున్నారు, మీ జీవితాలని....మా ఇంటికి నన్ను చూడవొచ్చిన వాళ్ళందరూ నా కళ్ళల్లో, మాటల్లో, నడకలో పొంగే ఈ సంతోషాన్ని చూసి ఆశ్చర్యపడుతున్నారు. నా హృదయంలో దాచుకున్న ఈ అమృతం సంగతి వీళ్ళకేం తెలుసు? నాకు దొరికిన ఈ అమూల్యమైన నిధి సంగతి లోకానికి వెళ్ళడి చెయ్యాలనిపిస్తోంది. లోపల్నించి అలలమల్లే పొంగివొస్తోంది ఆనందం. యెట్లా దాచుకోను? యెంత హాయి! ఈ జీవనమెంత అందమయింది.

# 9

దేవతలు నామీద ఆశీర్వచనాలు గుమ్మరించారు. ఈ ప్రపంచ గాన శ్రావ్యము గింగురుమంటోంది చెవుల్లో. ఈ కాంతి అంతా నా దేహంలో ప్రవేశించి ధన్యురాలనయినాను. నాలో కొత్త జీవమొకటి కదిలింది. తల్లిని కాబోతున్నాను. ఎందుకా నా దేహం రోజురోజూ ఇంత అందంగా కనబడుతోందనుకున్నా, తల్లినైతే ఆ చిన్న లేత గులాబి చేతులు నా రొమ్ములమీద వేసి, పాలు కుడుచుకుంటూవుంటే! ఓహో ఎందుకు నాకింత అదృష్టం! యేంచేశాను? యేదో చాలా పుణ్యం చేశాను. ఇంకేముంది? నా పార్థకి నా దేహం, నా సౌందర్యమిచ్చి సంతోషపెట్టడమే నేను చేసిన మహాపుణ్యం. పాపమా! పాపమైతే ఈ మహాకరుణ యీశ్వరుడు నామీద చూపిస్తాడా? నాకీ భూలోకంమీదే స్వర్గమిచ్చాడు. ఇంతకన్న స్వర్గం నాకింకేముంటి? అరుంధతే నన్నిట్లా ఆశీర్వదించింది........ పాపమా! నా బిడ్డ పుట్టడం పాపమన్నవాళ్ళు నాశనమవుతారు. వాళ్ళ వోర్చలేనితనం వాళ్లకే తగుల్తుంది. బిడ్డల్లేక, ప్రేమలేక, అట్లానే కుళ్ళి, వొంటరినై, ముసలిదాన్నై వరడునై, యెండి, యేడుస్తో, చస్తే మీ కళ్ళు చల్లగా వుంటాయా, పతివ్రతా తల్లులారా! మీరందరూ హాయిగా గంపెడు పిల్లల్తో ప్రతిరోజూ కాపరాలు చెయ్యడమేం. నేనిట్లా ముసలి మొగుడితో పడి చావడమేం? నా కర్మమా? నేనిట్లా ఆనంద మనుభవిస్తోవుంటే చూడలేక, వుక్రోషంతో పాపమని నన్ను నరకంలో తొయ్యాలని చూడడం, మీ ఖర్మం! మీదే ఖర్మం నాదికాదు. నాతో మాట్లాడ్డం మానేస్తారు. నన్ను వెలేస్తారు, యింట్లోంచి వెళ్లకొట్టిస్తారు. కాని నే ననుభవించిన ఆనందాన్ని లాక్కోలేరుగదా! నా బిడ్డని నా చేతుల్లోకి రాకండా చెయ్యలేరు గదా! అంతే నాక్కావలిసింది. ఇంక మీరేమన్నా చేసుకోండి. నాకు లక్ష్యం లేదు.

నేనూ అతనూ కలిసి మహదానందంలో సృష్టించిన ఆ చిన్ని జీవాన్ని, నా వెముకలోనించి బయటికి వొచ్చిన నా చిన్ని కూనని, నా మాంసములోంచి వొచ్చిన ఆ చిన్న శరీరాన్ని యెత్తుకుంటూ, యీ

చేతుల్లో. నేను తప్ప గతిలేనిదాన్ని, భద్రంగా కాపాడతా, పోషిస్తా. నన్ను 'అమ్మా' అంటే యీ చెవులతో వింటా. ఆ మాట అనడానికి నా చిన్న ముండ చేసే ప్రయత్నాలు చూసి పరవశమైపోతా. పార్థమీద నాకు మరీ ప్రేమ ఎక్కువయింది యిప్పణ్ణించి. ఈవాళ రాత్రి యీ సంగతి చెపుతా, యేమంటాడో! యింక నన్ను వొదిలెయ్యాలన్నా వొదిలేసి పోగలడా?....

# 10

రాత్రి వెళ్ళేటప్పటికే గడ్డి అంతాసర్ది మెత్తగా మాకు పక్క తయారుచేసి వుంచాడు. దానిమీద నక్షత్రాల కాంతిలో అతని చేతుల్లో అతని వేపు తిరిగి పడుకుని చెప్పాను. ఆవేశంతో నా జబ్బమీద గట్టిగా పట్టుకున్న మచ్చ నల్లగా యింకా కనబడుతోంది. దాన్ని చూసుకున్న కొద్దీ నాకిష్ట మెక్కువవుతోంది. రాత్రి నిశ్శబ్దం. నేను చెప్పే రహస్యం వినడానికి, సృష్టే ఆగి అక్కడ నుంచున్నట్లుంది. నా జుట్టుని తనచేత్తో పైకి దువ్వి, నా గడ్డం చేత్తో పట్టుకుని, నా కళ్లల్లోంచి లోపలికి, లోపలికి నా ఆత్మ లోపలికి చూసినట్లు చూశాడు. నా జుట్టులో తన మొహం దాచేసి- "నాన్నా నాన్నా నిజమేనా?" అన్నాడు. అతని మోహం బలమంతా నా మీద విరుచుకు పడ్డది పెద్దతుపానులాగు. నన్ను నలిపేశాడు తన చేతుల్లో రొమ్ముకదుము కుని. నా బిడ్డ తండ్రి, నా లోపలి జీవానికి జీవమిచ్చినవాడు. అతని దాన్ని కాకండా, లోకమంతా కలిసినా చెయ్యలేరుకదా! నా పొరపాటుకి జాలిపడి, నా వొంటరి తనానికి, నా ప్రేమలేని జీవాన్ని చూసి కనికరించి నాకు యీశ్వరుడిచ్చిన పార్థ! అతన్ని వొదులుతానా? నా బిడ్డ తండ్రికాకండా యెవరూ చెయ్యలేరు కదా మమ్మల్ని విడతీసినా!

పార్థ నన్ను తనతో వొచ్చెయ్యమన్నాడు యీ యింటోంచి. ఈ మధ్యాహ్నం యీ నడవలో వొంటరిగా కూచుని ఆలోచిస్తున్నా, వెళ్లనా వొద్దా అని. ఇన్ని సౌఖ్యాలు వొదలాలే. ఈ చీరెలూ, ఈ గదులూ యివన్నీ వొదిలేసి, చిరుగు చీరెలు కట్టుకుని, యెక్కడో దుమ్ముకొట్టి

తిరుగుతోవుంటే పార్థసారథికి యిప్పటిమల్లే ప్రేమ వుంటుందా? ఏదో ఒకటి పేళకు దొరికింది తింటో, వున్నప్పుడు తిని, లేనప్పుడు పస్తుపడు కుని నేను బతగ్గలనా? అప్పుడూ పార్థకి యింత అందంగా కనపడ తానా అందంగా కనపడకపోతే నామీద యిష్టమిట్లా వుంటుందా అతనికి?

కాని యీ ముసలాయన్ని చూసినకొద్దీ కోపమెక్కువవుతోంది. పార్థసారథి నా జీవితంలోకి వొచ్చినా, యింకా నా భర్తనే అంటాడీయన. నిద్రపోయ్యేముందు ఆ పెద్ద మంచంలో పడుకుని, నామీద చేతులేస్తాడు. తనని చూసి నేను భ్రమసిపోతున్నాననే గావును ఆయన వుద్దేశ్యం!— పాపం యెంత ప్రేమ ఈ ముసలాయనకి నామీద. యిట్లా తిడుతున్నాగాని, అంత పిసినారీ, నేనేమడిగినా కాదనకుండా తెచ్చిస్తాడు. ఆయన్నేడిపించడం యేం కృతజ్ఞత?........ఈయన మా మామగారై వుంటే యెంత బావుం దేది? అడిగిందల్లా యిట్లా నాకు ప్రేమతో యిస్తో ఆ గడ్డి వాము మాకు వొదిలేసి, తనొక్కడూ ఆ మంచంమీద పడివుంటే? అట్లా వుండకండా నామీద చేతులెయ్యాలని చూస్తాడు?........నాకు కొడుకు పుడితే తనకొడుకే అంటాడు గావును! అందరూ ఈయన కొడుకే అంటారు నా పార్థ కొడు కుని. నే నదెట్లా భరిస్తా? పైగా పోలికలు చూస్తారు .... చెప్పనా ఈయనతో కడుపుతున్నానని? మరి చెప్పి తీరాలి యెప్పుడో త్వరలోనే? పిచ్చి వెధవ. చాలా సంతోషిస్తాడు తండ్రి అయేటంత హోదా తనకేకటా కలిగిం దని. అదంతా తన ప్రయోజకత్వమే అనుకుంటాడు. తన వంశం నిలబడు తుందని పొంగిపోతాడు. నన్నింక కాలు కింద పెట్టనీడు. కొండమీది కోతి నన్నా కావాలంటే తెచ్చిపెడతాడు........అయినా ఈయనతో వుండడం నాకిష్టంలా. ఇక్కణ్ణించి వెళ్లడమూ యిష్టంలా. ఈయన పోతే బావుండును. ఇంకా యెన్నాళ్ళు బతుకుతాడో! ఎన్నటికీ చావకండా వరం పొందిన వాళ్లల్లో ఈ ముసలాళ్ళు మొదలు....అయ్యో పాపం! ఈయన్ని చావాలని కోరుకుంటానేం? ఎంత చెడ్డదాన్నవుతున్నా! ఈయనంత వుపకారం చేసిన వాళ్ళు నాకింకెవరూలేరు. ఈయనే లేకపోతే యిట్లా మర్యాదగా పార్థసారథికి బిడ్డని కనడానికి వీలెల్లా వుండేది?

పార్థసారథితో వెళ్ళిపోనా? ఈ కొత్త ప్రేమ పోయింతరవాత, యెందుకు వచ్చేశానా అని దిగులేస్తుందేమో? ఈ సౌఖ్యాలూ, ప్రేమా రెండూ వుంచుకునే పద్ధతిలేదూ? మనసంతా వొకరికిచ్చి, దేహం యింకొకర్ని తాకనియ్యడమంత నరకం యింకేమీ లేదు....ఈ సౌఖ్యాలన్నీ కావాలనడం కూడా పార్థసారథికి అందంగా కనపడాలనే......పార్థ వూపిరాడకుండా అదుముతో 'వొస్తావా? రావా?' అంటే రానని యెల్లా అనను? కాని యింకేవిధం లేదూ, వెళ్ళకండా?

# 11

ప్పార్థసారథికి భయం పోతోంది. నిన్న నేను వేళకి తోటలో తనకోసం వుండకపోతే యింటోకి వొచ్చాడు. ఈసారి గదిలోకి వొచ్చి లాక్కెడతానన్నాడు. తన దగ్గిరికి నేను వొచ్చేముందు ఆ తోటలో నుంచుని ఆ నిమిషం ఆ ముసలాయన నన్నేం చేస్తున్నాడో అని కోపంతో వొళ్ళు మరచిపోతాడు. ఇంక ఆ వెర్రి యెక్కువయిందంటే యెప్పుడో మా గదిలోకి వొచ్చేసి ఈయనతో నాకోసం పోట్లాడుతాడు. మరి నేను మాత్రమేం చెయ్యను ? ఒక్కొక్క రోజు ఈయన పదకొండింటి దాకా నిద్రపోరు. పార్థ తోటలోనించి మమ్మల్ని చూడకండా కిటికీలన్నీ వేశేస్తా. దీపం తగ్గిస్తా "నీకుకూడా సిగ్గూ, జాగర్తా వొచ్చేయ్? పెద్దదానవవుతున్నా" వని సంతోషిస్తారు......... నిన్న రాత్రి మరీ బలవంతం చేశాడు పార్థ తనతో వచ్చేసి తీరాలని. రాకపోతే వొప్పుకోనన్నాడు. కాని నా సందేహాలతనితో యెల్లా చెప్పను? అతని ప్రేమ మీద నాకు సందేహమని చెప్పడమెల్లా? యెప్పుడో వొకరాత్రి మళ్ళా నే నింట్లోకి పోకండా వుళ్ళోకి లాక్కెడతాట్ట. ప్రేమ ఇంత గొప్పదనీ, ప్రేమ లేకండా బతకలేననీ తెలిసికూడా ఇంకా ఎందుకు సందేహిస్తానో తెలీదు. ఏదో

భయంగావుంది. నా మర్యాదా, ప్రతిష్టా, కులం వాళ్ళతో పొత్తూ పోతాయని భయమేమో? ఇంత పిరికిదాన్నేం?

ఈయనికి తెలిసింది. ఇంక ఆయన సంతోషానికి మేరలేదు. ఆ వెర్రిసంబరం చూస్తే నా కసహ్యం వేస్తోంది. ఇంత తెలివితక్కువ వాళ్ళు కూడా వున్నారు లోకంలో. ఇప్పుడు నాకేం కావాలన్నా యిస్తాడు. ఏం చెయ్యమన్నా చేస్తాడు. ఈయన వెర్రితనం చూసి దిగులుకూడా పుడుతుంది. మా ఇంటికి నన్ను చూడ్డానికి వొచ్చిన సూర్యనారాయణగారి ఆడవాళ్ళు నా సంగతి గుర్తుపట్టి ఆయనతో చెబితే ఆ సూర్యనారాయణగారు యీయన్న డిగారుట. నిజమేనా? అని నన్నడిగారీయన. యేమనను? "నాతో యెందుకు చెప్పలా? అంతసిగ్గా" అని బుగ్గ పట్టుకున్నాడు. నాన్న పట్టుకున్నట్టే. పార్థతో చెపితే జరిగిన సంగతి జ్ఞాపకమొచ్చింది.

ఇంటిచుట్టూ తిరిగి నేను వొదలబోయే ఈ మంచి వొస్తువులన్నీ చూసుకుంటున్నా. యీ నిలువుటద్దం చూస్తే నాకెంతో యిష్టం. దాన్ని తీసు కెళ్ళడానికి వీలుందేమో యీయన్ని అడగనా? నవ్వొస్తుంది. యేం వెర్రి వూహాలు పుడుతున్నాయి. యీ నగలన్నా రెండు తీసికెళ్ళకండా వుండ గలనా? యీ పలకసర్లూ, అడ్డిగా నా మెళ్ళోంచి తీసేటప్పుడు యేడుపు రాదూ? కాని పార్థ ఒక్కనగ కూడా తీసుకురావడానికి వీల్లేదంటున్నాడు.

## 12

సంగతులు నా కనుకూలంగా తటస్థిస్తున్నాయి. ఆయనవూరికెళ్ళాడు. వొక్కత్తెనీ వొదిలి వెళ్ళాలే అని సంకోచించాడు. ఒకవేళ చివరికి వెళ్ళ రేమోనని భయమేసింది. మళ్లా తొందరగానే వొస్తాలే అని వోదార్చారు. అంత గుడ్డిమనిషేం? నా మొహంలో సంతోషం కనపడలేదూ?నేనూ వేషా లేశాను. తొందరగా రమ్మని బతిమాలుకున్నాను.

ఆ రాత్రి పార్థని యింట్లోకి రమ్మంటే రాలేదు. నిన్న రాత్రి కూడా వెడదామా వొద్దా అని యింకా అనుమానిస్తూనే వున్నా. "నన్నునమ్ము, నా మీద విశ్వాసముంచు. నీకేం కష్టం కలగనీను. రమ్మ"న్నాడు. కానియింటోకి వొచ్చి పార్థసారధి ఈ వెండిసామానులూ, భోజనం, మంచం అవీ చూస్తే, ఇవన్నీ వొదులుకుని రమ్మంటాడా అప్పుడుకూడా అని సందేహంగావుంది. అటుపంటివన్నీ తనకోసం వొదులుకు వొస్తున్నాననన్నా తెలుస్తుంది. పోనీ తనబిడ్డకి ఇవన్నీ వుండాలనన్నా అనుకోడూ తను? నిన్న రాత్రి యింక యీవాళ తనతో రాకపోతే వెళ్ళిపోతానన్నాడు.

"నన్నొదిలి పెడతావూ? నీకు చాతనవుతుందీ? యేమ్మాటల్లే" అన్నాను.

"చూసుకో. అంత చాతగానివాణ్ణనుకున్నావా? అతనిదానివన్నా, నాదానివన్నా కావాలి నువ్వు. ఇంక నేనాగను. ఆ ముసలాయన్ని పాపం ఇల్లా మోసంచెయ్యడం నాకసహ్యమేస్తోంది. ఇంక భరించలేను, నీ ఇష్టం" అని కఠినంగా అన్నాడు.

అట్లానే కదలకండా అతని చేతుల్లో పడుకున్నాను. తెల్లని వెన్నెల ఇట్లా నన్ను బలవంతం చేస్తున్నందుకు నాకు సంతోషంగానే వుంది. నా మీద యింత ప్రేమ గనకే, నన్నంత బలవంతం చేశాడు. నన్ను కావిలించుకున్న ఆ గట్టిచేతులు వొణికాయి. నిజంగా నన్ను వొదిలేసి వెళ్ళిపోతాడేమోననే భయంతో నేనూ వొణికాను. పార్థనెట్లా వొదులుకోగలను? గట్టిగా పట్టుకున్నాడు నన్ను. నా గర్భంలో బిడ్డ కదిలింది. మా బిడ్డ... మా ఇద్దరి బిడ్డ...మా ఇద్దరిమధ్యా కదిలింది. అతను మళ్ళీ వొణికాడు. అతనికీ తగిలింది కావును. ఆ అద్భుతమైన నిమిషంలో కాలమే ఆగిపోయింది. మా అనురాగం కోసం తన తండ్రికోసం ఆ బిడ్డ తనే మాట్లాడినట్లుంది. నిశ్చయించుకున్నాను. భూములు, ఐశ్వర్యం నగలూ, సౌఖ్యం, మర్యాద, నీతి, ఇవన్నీ నాకూ, నా బిడ్డతండ్రికీ మధ్య రానిస్తానా? తండ్రీ, తల్లీ, బిడ్డా, ఇంకేం కావాలి? నా చెయ్యిని అతని మెడచుట్టు వేశాను.

"వొస్తా."

# 13

జరిగిన గోల, అవమానం దుఃఖం తలుచుకుంటే ఆ పదిహేను రోజులూ యెట్లా బతికానా అనిపిస్తుంది. రైలులోంచి దిగకముందే నన్నూ పార్థని అరెస్టుచేసి మా ఊరు మళ్ళీ తీసికెళ్లారు. ఇంకపోలీసు, కోర్టు విచారణ, ఎన్నో అడావిళ్ళు. నా గోషాగీషా అంతా యెగిరిపోయింది. గుంపులు గుంపులు వచ్చి నన్ను చూసేవాళ్ళే! పోలీసువాళ్ళు నన్ను ఆయనతో ఇంటికి పొమ్మన్నారు. నన్ను చంపినా నేను వెళ్ళనన్నాను. లాక్కెళ్ళి పడేస్తామన్నారు. పడెయ్యగానే మళ్ళీ పార్థ దగ్గిరికి పరుగెత్తుతానన్నాను. నాకు అప్పుడు అంత ధైర్యం యెట్లా వొచ్చిందో తెలీదు. యెన్నడూ గుమ్మందాటి మొగవాడి మొహం యెరగనిదానికి! అందుకేనేమో అంత మొండితనం. మొగాళ్ళతో మాట్లాడేవాళ్లకి సిగ్గు చాతనవుతుంది. గోషావాళ్ళు ఒకసారి బయటపడ్డారా సిగ్గూ, భయమూ అలవాటు లేకపోవడంచేత వాళ్ళ తెగింపు యెవరికీ వుండదు. నన్నుకూడా పార్థతో కైదులో పెట్టారు. ప్లీడర్లూ, విచారణా యేమేమిటో! కలలోమల్లే జరిగిపోయినాయి. కాని యేమైనాసరే పార్థని వదలననీ, పార్థ నన్ను వదలడనీ నిశ్చయమేర్పడ్డది. ఏ విచారణలైతే నాకేం? ఒకరోజు ఇద్దరినీ కచేరిలో నుంచోపెట్టారు. ఆ ముసలాయన కూడా వున్నాడు. ఆయనవంకన్నా చూడలేదు నేను. ఆ మాస్ట్రీటు పార్థకి ఒక అరసంవత్సరం కైదు వేశాడు. నాకళ్ళు తిరిగాయి. వొణుకు పుట్టింది. ఏదో ధైర్యం వచ్చి.

"మరి నాకో?" అని అరిచాను.

మాస్ట్రీటు తలయెత్తి నావంకచూసి వూరుకున్నాడు. ఇంకో ఆయన యెవరో "నువ్విట్లాంటి బుద్ధితక్కువ పనులు చెయ్యక పెనిమిటితో సలక్షణంగా కాపరముండు" అన్నాడు.

నా పార్థకి నన్ను కావిలించుకున్నందుకు కైదా? నాకు ముసలాయనతో కైదా?

"నాకు కూడా అతనితో కైదు వెయ్యండి, నేనూ అదే తప్పిదం చేశాను" అన్నాను.

యెవరూ వినుపించుకోలేదు. నా ఆవేశంలో, నా మహా విచారంలో సిగ్గూ భయం మరిచిపోయాను. పార్థమీద యెంత ప్రేమ పచ్చిందీ చెప్పలేను. నా కడుపు చీల్చి పేగుల్ని అతని కాళ్ళకింద పారెయ్యాలనిపించింది. పోలీసులు అతన్ని వెనక్కి తీసుకుపోతున్నారు. పరిగెత్తికెళ్ళి అతన్ని కావిలించుకున్నాను.

"పార్థా, ఆ కైదులోంచి వొదలగానే నా దగ్గిరికి వొస్తావు కదూ! ఒక్కనిమిషం ఆలస్యం చెయ్యకండా! యెక్కడ యెట్లావున్నా సరే. నీతో వచ్చేస్తా"నన్నాను.

"తప్పకుండా" అన్నాడు దృఢంగా.

"సరిగ్గా రోజులు లెక్కపెట్టుకుని రాకపోతివా! చచ్చిపోతా. ఇంక నన్ను చూడవు" అన్నాను.

# 14

నా పార్థని తీసుకుపోయినారు. ఇంక నేనెక్కడ వుంటేనేం? నా వొళ్ళు నాకు తెలీదు. నాయుడుగారు ఇంటికి తీసుకుపోయినారు. ఆయన నాతో మాట్లాడలేదు. అమ్మమాత్రం వచ్చి రోజూ యేడ్చేది. నాన్న నా మొహం చూడనన్నాట్ట. బంధువులూ, స్నేహితులూ, ఎవ్వరూ రావటం మానేశారు. ఎంతో రక్షించారు.

వికారం, డోకులూ, ఏమీ సయించదు. నా నడుము చక్కనివొంపు అన్నీ దాచుకుని అసహ్యంగా తయారవుతున్నాయి. ఒకసారి నాయుడుగారు నాకు వినపడేట్టు అంటున్నాడు.

"ఈ పాడుముండ కోసమా! పుట్టబోయే వంశాంకురం కోసంగానీ? ఆ వెధవా ఇదీ యే యేట్లొనన్నా తగలపడనీ!"

మొదట నాకు నవ్వొచ్చింది గాని, తరవాత చాలాకోపమొచ్చింది. నా పార్థ బిడ్డని తన వంశాంకురంట! వీడి మొహానికి! పార్థ రాగానే ఒక్కరోజు అక్కడ వుంటేకద! వంశాంకురం వుండదు, గింశాంకురం వుండదు,

ఆయన్ని చూస్తే పూర్వం జాలివేసేది. ఇప్పుడు మొహం చూస్తే దోకు వెళ్ళుకొచ్చేది. ఆయన ఎదురుపడితే ఆయన మొహాన్నే చీదరించు కొని అవతలకు పోయేదాన్ని.

నాకు పండుగలు, పుత్సవాలు చేశారు కొద్దిగా. ఎవరికి మనసు పుడు తుందీ చెయ్యడానికి? అప్పటికీ ఆయనకి సిగ్గులేదు. తను చేశాననుకునే ఘనకార్యానికి బడాయి తగ్గలేదు. ఎవరు ఇంటికి వొచ్చినా సరే!

"మా ఇంట్లో యే నిమిషాన పురుడు వస్తుందో ఆదుర్దాగా వుందండి! లేక లేక మా వంశానికి......"

ఇట్లా మాట్లాడేవాడు. అదే, అదే మాట నాతోనే మాటలుంటే ఎంత వాగేవాడో? పాపం ఎంతయినా ఆయన్ని చూస్తే నా జాలి తగ్గదు.

ఫాల్గుణ పౌర్ణమినాడు అబ్బాయి పుట్టాడు. మొదటిరోజు వాడి మొహం యేమీ తెలీలేదు. కాని పుట్టగానే ఎంత ప్రేమ వొచ్చింది నాకు! నా హృదయంలో అంత ప్రేమ వుందని నాకెన్నడూ తెలీదు. అప్పుడు గనక పార్థ వొచ్చి "నా ఖైదు అయిపోయింది. ఈవాళ నాతో వొస్తావా అంటే" అబ్బాయికి చలిగాలి తగులుతుందీ, రా"ననేదాన్నే. ఎంత ప్రేమ ఆ కోతిపంటి ముడతల వొంటిమీద! ఎర్రని లేతనోరు నా రొమ్ముకి తగిలే టప్పటికి నా ప్రాణాలన్నీ లేచివొచ్చి ఆ రొమ్ము చివర అమృతాన్ని తాగు తున్నట్లయింది. అట్లాంటి అనుభవమయిం తరువాత, దాంటోనే కళ్ళుమూసి ఈలోకంలో మళ్ళీ తెరవని తల్లులు ఎంత ధన్యులో? నాకే అట్లా అయితే నరకబాధ తప్పును కదా!

ఈ వొక్క నిమిషపు సుఖం నేనుపడ్డ పదిగంటల నరకబాధనీ, చల్లని చేత్తో తుడిచేసి, మాయం చేసినట్టయింది. తల్లికావడం కంటె పుణ్యకార్యం యేముంది లోకంలో? మూడోరోజు నా అబ్బాయిని చూసే ప్పటికి నా గుండెల్లో అణచరాని మహా ఆనందం. పూపిరాడనీకుండా కమ్మేసింది. ఎవరదీ? నా చిన్నపార్థ! నా పార్థే అచ్చు నా పార్థ మళ్ళీ! ఆ నాలుగురోజులా పార్థని మరచిపోయినా ఖైదులోంచి చేతులు జాచి నన్ను కావిలించుకున్నాడు. ఆ పుంగ్రాలజుట్టు! మెరిసే చిన్న కళ్ళు అతనే! పోలీ సులు అతన్ని నా దగ్గిరికి రానియ్యకపోతే తపస్సుచేసి చిన్నవాడై

నా దగ్గిరికి ఎగిరి వొచ్చి నా రొమ్ముమీద చేతులేసి, పాలు కుడుచుకుంటున్నాడు. దొంగ నా పార్థ అబ్బాయిని చేతుల్లో పట్టుకుని, లేచి, పరుగెత్తుకెళ్ళి జైలులోకి—

"చూడు చూడు! పార్థా చూడు యెవరో!" అనాలని ఒకటే బాధ పడ్డా! చప్పున లేచాను మరచిపోయి. కళ్ళు తిరిగి, కాళ్ళు వొణికి, కూలబడ్డాను.

అయితేనేం? పార్థ వొస్తాడుగా! దమ్మిడీ అంత చిన్న యెర్రని నోరు, లేతచిగుళ్ళు, ఆ మడతలు, ఎన్నిసార్లో ముద్దుపెట్టుకున్నా. "పార్థా నా పార్థ" అన్నాను. అప్పుడప్పుడు ఆ నల్లకళ్ళు తెరిచి నావంక నిదానంగా చూసేవాడు, నేను తెలుసు, నేను గుర్తుకదూ మరి!

# 15

బారసాల జరిగింది. శేషగిరిరావు నాయుడని పేరు పెట్టారు. కాని నేను మాత్రం "పార్థా" అని పిలిచేదాన్ని. ఆయన ఎత్తుకోడానికి వొచ్చారు. మొదట నాకు వొళ్ళు మండిపోయింది. "ఛీ" అని అరిచాను. కాని తరవాత ఏం చెయ్యను. ఆయన ముద్దాడగానే అబ్బాయిని కడిగేదాన్ని. వాడెవడో నా బిడ్డని నా కిష్టంలేంది ముట్టుకోడానికి. ఆయన "శేషా" అంటే అబ్బాయి అట్లా చూసేవాడన్నా కాదు. నేను "పార్థా" అంటే అప్పటికప్పుడే నావంక చూసి నవ్వేవాడు. ఇంక నా రోజులన్నీ నా చిన్ని పార్థతో సరిపోయినాయి. నీళ్ళు పొయ్యడం, పాలు తాగించడం. మళ్ళీ నా వొళ్ళు చక్కగా అందంగా అయింది. నా కళ్ళల్లో కొత్త మెరుపు వొచ్చింది. ఇంక పార్థ రాకపోతేనేం అనిపించింది. అంత ఆనందంగా వుంది అబ్బాయిని చూస్తే. కాని పాపం కైదులో ఏం చేస్తున్నాడో! నాకీ చిన్న పార్థని ఇచ్చినందుకు కదూ? ఆ మహా పాపానికికదూ అతన్ని రాళ్లు మోయిస్తోంది! అదేం న్యాయమో? పాడు కోర్టులు! అన్నీ అన్యాయాలే!

అబ్బాయి పుట్టినా నన్నెవరూ చూడడానికి రాలేదు. అబ్బాయి పుట్టిం తరవాత ఆస్తి ఆశ వొదులుకున్నారు బంధువులు. ఆయన చుట్టూ తిరిగే

అన్న కొడుకులూ వాళ్ళూ మొహమన్నా కనపరచలా! లేచి పోయిందాన్ని తీసుకొచ్చి దాని బిడ్డకి ఆస్తి ఇవ్వడం వాళ్ళకేమీ బావుండలేదు. అతి నీచమైనపని చేశాడని అందరితోటీ చాటించారు.

## 16

నా బాబు పాకుతాడు. నన్ను "అం" అంటాడు. నేను బాగా గుర్తు. ఒక్క నిమిషం నేను కనపడకపోతే ఇల్లంతా "అం, అం" అనుకుంటో తిరుగుతాడు. దొరగారు నిద్రలేచేటప్పటికి నేను పక్క దగ్గిర ఎదురుగా కనపడాలి. లేకపోతే దూకుడు చేస్తారు. పొద్దస్తమానం వొంటరిగా ఇద్దరం ఆడుకునేవాళ్ళం, ఒక కుక్క బొమ్మని కొన్నాను. దాని తలమీద కొట్టి అరిపిస్తే ఒకటే నవ్వేవాడు. ముందు యెలికపళ్లు రెండొచ్చాయి. నా వొళ్ళో కూచుని నా చెంపలమీద చిన్ని చేతులు వేసి, ఏమిటేమిటో కబుర్లు చెప్పేవాడు. నేను పిచ్చి సంగతులు వాగేదాన్ని, మాట్లాడానికి నాకింకెవ్వరున్నారు? మధ్యాహ్నం వసారాలో పిచ్చికలు గింజల్ని ఏరుకుంటోవుంటే, పిల్లి పెట్టెమూల నిద్రపోతూవుంటే ఎంత మెల్లిగా పాకి మావేపు వస్తూవుంటే, పార్థ కబుర్లన్నీ నా చిన్ని పార్థతో చెప్పేదాన్ని, నాన్న వొస్తాడనీ, ఆడుకుందామనీ చెప్పేదాన్ని. అర్థమైనట్లే "ఊ. ఊ" అనేవాడు. ఇంకా కొంచెం యెదిగింతరవాత "నాన్న వొస్తారు" అంటే "న్న, న్న" అని ఆ ముసలాయన గదివేపు చూపించే వాడు. "లేదు తాత" అని నాలుగురోజులు నేర్పాను. ఒకరోజు ఆయన రాగానే "తా, తా, తా" అనుకుంటో దగ్గిరికి వెళ్ళాడు. గోడవెనక నుంచొని మనసుతీరా నవ్వాను.

రాత్రంతా నా పక్కన నిద్రపోయేవాడు. పడుకుంటే ఎంత బావుండేవాడని! అంత అందమైన అబ్బాయిని యెక్కడా చూడలా! పార్థ కూడా అంత అందంగా వుండడు. మీకు పిల్లలుంటే తప్ప, లేకపోతే మా చిన్న పార్థ అందరిలోకీ అందమంటారు.

ఒకరోజు చిన్న పార్థకి జబ్బుచేసింది. అప్పుడు తెలిసింది నాకు అబ్బాయిమీద ఎంతప్రేమో. ఒక్కసారి అబ్బాయి కక్కుకుంటే నేను

పేగులన్నీ కక్కేసినంత బాధగా వుండేది. అబ్బాయి చచ్చిపోతాడేమోనని ఒక భయం. రాత్రంతా మేలుకుని వాళ్ళో పెట్టుకుని కూచున్నా. నా వాళ్ళో వుంటే చచ్చిపోడని ధైర్యం. వాళ్ళోవుంటే ఎప్పుడూ నా దగ్గిర వుండే వాడేమో, ఇట్లా వొంటరిగా నన్ను వొదలకండా.

## 17

ఒకరోజు మధ్యాహ్నం పార్థ కనపడ్డాడు. కిటికీదగ్గిర తల దువ్వుకుంటో నుంచున్నా. ఇంకా పది పదిహేను రోజులకిగాని రాడని నా లెఖ్ఖ. కిటికీదగ్గిరకి వొచ్చి "రాత్రి పదింటికి వొచ్చేయి. రోడ్డుమీద వుంటా" అని వెళ్ళిపోయినాడు ఎంత విశ్వాసమో! వొస్తానో, రానో అనే సందేహమే లేదు. ఇంక ఒక్క నిమిషం ఆ యింటో యెందుకుంటాను? అబ్బాయిని తీసికెళ్ళాలా. లేదా అని సందేహ మొచ్చింది. ఇక్కడేవుంటే యీ ఆస్థీ, యిల్లూ, భూములూ అన్నీ వుండి సుఖపడతాడు. కాని నాతో వొస్తే కటికదరిద్రం, రేపణ్ణించి వెండిగిన్నెలూ. పరుపూ, వుయ్యాలా, పట్టుచొక్కాలూ వుండవు. కాని నే లేకండా ఒక్కడూ ఎట్లా వుంటాడు?

మర్నాడికే ముసలాయన కబురు.

"నువ్వు పోతేపోయినావు, నా కొడుకుని తీసుకుపోవడానికి మీకే అధికారం లేదు. అబ్బాయిని పంపించమని"

తన కొడుకుట! నా అబ్బాయిని ఇవ్వను పొమ్మన్నాను. అల్లరి అవుతుంది. నెమ్మదిగా యివ్వమన్నారు. నేనిస్తానా? నేనెందుకిస్తాను?

ఆ పదిరోజులూ యెక్కడ వున్నామో, యేం తిన్నామో జ్ఞాపకం లేదు. ఎక్కడో వూరిబయట ఏదో గుడిశలో వున్నాం. ముగ్గురం కావిలించుకుని పడుకునేవాళ్ళం, ఎంతో ఆనందంగా. కాని నాకు ఒక కష్టమనిపించింది. నా చిన్న పార్థని చూసి, పార్థ ఎంతో ముచ్చట పడతాడనుకున్నా, ఎత్తుకునేవాడు గాని, అంతా నా కోసమే, అతని కళ్ళన్నీ నామీదే వుండేవి. అయితేనేం అంత సంతోషం ఇంక ఎన్నడూ నేననుభవించలా. అక్కడితో అఖరు. ఆ రోజునే చచ్చిపోయినాను. కోర్టు సమన్లు వొచ్చాయి

అబ్బాయిని తండ్రికి వొప్పజెప్పమని. పార్థ వూళ్ళోకి ప్లీడర్లతో మాట్లాడ్డానికి పరిగెత్తాడు. దిగులు మొహం వేసుకువొచ్చి "లాభం లేదట' అబ్బాయిని ఇచ్చెయ్యాలి" అన్నాడు.

నా గుండెల్లో రాయిపడ్డది. నా అబ్బాయిని ఇవ్వాలా! కానీ నేను నమ్మలేదు. లోకంలో అంత ఘాతకులు వుంటారనుకోలేదు. తల్లి కన్న పిల్లని ఇంకోడికి ఇప్పిస్తారా? ఆవుదగ్గిర్నుంచి దూడని తియ్యరే? కోడి నించి పిల్లని తప్పించరే! భూతదయగల దేశమే? నా దగ్గిర్నించి నన్ను వొక్క నిమిషం విడవని యీ గుడ్డుని లాక్కుంటారా? పాలు విడవని కూనని, కన్ను తెరవని పాపని, నా దేహంనించి కోసేస్తారా? అంటుతొక్క వెంటనే చెట్టునించి విడతీస్తారా? పసిపిందెని ప్రాణంలేని చెట్టునించి కొయ్యరే? నా పాపని నానించి తుంచేస్తారా? ఆయనకంటే నామీద కోపం, కాని కోర్టువాళ్ళ కేంకోపం నామీద?

ఆ నాలుగురోజులూ పాపని వొక్క నిమిషం విడవకుండా యెత్తుకున్నా, యెవరోవొచ్చి అబ్బాయిని నాదగ్గిర్నించి లాక్కు వెడుతున్నట్లే వుండేది. పార్థ పిలిచినా నేను పలకలేదు. అతనికి కోపంకూడా వొచ్చింది. కోర్టుకు వెళ్ళాం. యేమేమిటో చేశారు. నన్నేమిటో ప్రశ్నలడిగారు. తండ్రి ఆస్థి గనక, కొడుకుని తండ్రికి వప్పచెప్పమన్నారు. నా గుండె నీరై పోయింది. నే నివ్వనన్నాను. వీల్లేదు, లాక్కుంటామన్నారు. పార్థ నన్ను వూరుకోమన్నాడు. యేం చెయ్యను? యెవరుదిక్కు? మేస్ట్రీటు కాళ్ళమీద పడ్డాను.

"నన్ను వొదిలి బతకడు. చచ్చిపోతాడు. నా బిడ్డని, యేడిపించకండి. ఒక్క నిమిషం నేను లేకపోతే "అమ్మా! అమ్మా! అని అల్లాడిపోతాడు. నా బిడ్డని వొదిలి నేను బతకలేను. మీకు పిల్లలు లేరా? మీది కడుపుకాదా?" అని యేడ్చాను. అవును మరి ఆయన మాత్రం మొగాడు కదూ? ఆయనభార్య లేకపోతే వంశంపేరు పెట్టి, పిల్లనీ తల్లినీ వేరు చేసి హింసపెట్టవొద్దూ? ఆ మొగవాళ్ళందరూ కట్టు, అప్పటికీ ఆయన కళ్ళంబడి నీళ్ళు కారాయి. మొహానికి దయవొచ్చింది. ముసలి నాయుణ్ణి చూసి,

"పోనీవయ్యా యింకో రెండేళ్ళు తల్లిదగ్గర వుణ్నీ" అన్నాడు.

"వీల్లేదు దానిదగ్గర ఒక్క నిమిషం వీల్లేదు" అన్నాడు ఆ నాయుడు.

"అయితే తల్లి దగ్గిర్నించి లాక్కెడతావా? బతుకుతాడా? ఆ పిల్ల వాడు?"

నాకెంతో సంతోషమయింది. ఇంకా అబ్బాయి నాదగ్గిరే వుంటాడు. ఇంతలో ముసలాయన....

"అంత పిల్లవాడిమీద దయగలిగిందైతే వొచ్చి యింట్లో వుండ మనండి! నే నొక్క పల్లెత్తుమాట అన్నానా?" అన్నాడు.

"అవును వెళ్ళు" అన్నాడు మేస్ట్రిటు. ఇట్లా తిరుగుతుందనుకో లేదు నేను. పార్థవంక చూశాను. అబ్బాయివంక చూశాను. యేం చెయ్యను? అంతలో తటాలున వొక ఆలోచన తోచింది. వొళ్ళు పులక రించింది. ఇంక బతికిపోయినా ననుకున్నాను. సిగ్గుపోయింది, నా ప్రాణం కోసం పోట్లాడేటప్పుడా సిగ్గు! యింకేం? తలయెత్తి మెల్లిగా.

"అసలు యీ అబ్బాయి ఆ ముసలాయినకి పుట్టలేదు" అన్నాను.

ఆమాటతో కోర్టుఅంతా నిశ్శబ్దమయింది. ఒక్క నిమిషం వూపిరి బిగపట్టారు. యెవరో కొంచెం నవ్వారు. అందరూ గొల్లుమన్నారు. మేస్ట్రిటుకూడా. నాకు అపరిమితమైన సిగ్గేసింది. యెట్లాఅన్నానో ఆ మాట? యెక్కడన్నా మొహం దాచేసుకోవా లనిపించింది. మేస్ట్రిటు నవ్వు. ఆపుకుని....

"అసంగతేమిటో మాకు తెలేదు. అయినా, ఆయన కొడుకే" అన్నాడు.

ఇదేమిటి? యిదేం న్యాయం? ఆయన కేమీ సంబంధంలేనిది! తొమ్మిది నెలలూ మోసి, అంతబాధపడి, తెచ్చుకుంటే, నాపార్థ దగ్గిర్నించి వీళ్ళు ఆ ముసలాడికి యిమ్మంటారేం? నమ్మకపోతే విచారణ చేయరాదూ?

పార్థకి కోపం వొచ్చింది.

"వీడు నా కొడుకు. ఆ ముసలివాడికి కొడుకులే? దోమని గుడ్డు పెట్టించమనండి. పన్నెండేళ్ళు కష్టపడి! ఆయనకి కొడుకేమిటి?" అన్నాడు.

అందరూ మళ్ళీ నవ్వారు-కాని వాళ్ళకి నచ్చలేదు. నన్నూ అబ్బాయినీ నాయుడితో వెళ్ళమని వుత్తరువు చేశారు.నాకు అధైర్యం వొచ్చింది. ఇంతా సిగ్గువిడిచి చెప్పినా కార్యంలేదు. యెవడు ఆ ముసలి వాడు మధ్య? మళ్ళీ న్యాయమట. పక్షపాతం లేదట! ఆ ముసలివాడు మేస్ట్రీటుకి లంచం ఇచ్చి వుండాలి. పార్థని మళ్ళీ ప్లీడర్నీ కనుక్కో మన్నాను. అతనూ అదే అన్నాడు. నాయుడి భార్యని కనక, యెట్లా కన్నా అబిడ్డ నాయుడి బిడ్డేనట! యేం తెలివిగా, సరసంగా వుంది! అంబోతుకి కన్నా దూడలు, కాపువాడి వైనట్లు? నేను గొడ్డునే! నన్ను ముసలాయన కొన్నాడు. తిండి పెట్టాడు. కనక నా దూడలు ముసలాయనవే! మళ్ళీ వీళ్లు మనుషులట! నాగరికమట! రుషులూ, యోగులూ వున్న దేశంట! స్వరాజ్యంట! యిదీ న్యాయం! నేను గొడ్డునా చెట్టునా?

మర్నాడు పొద్దున్న యేదీ చెపుతానన్నాను. సాయింత్రమంతా ఆలోచించా, పార్థని వొదిలి యెట్లా వెళ్ళను. నా కోసం కైదుకి వెళ్ళాడు. తల్లి తండ్రుల్ని వొదిలాడు. ఇప్పుడతన్ని ఎట్లా వొదలను? అతన్ని వొదిలి ఎట్లా బతకను? అతనే నా ప్రాణం. అతనే నాజీవం వొదల్లేను కాని నా చిన్ని పార్థని? ఎట్లా? ఎట్లా? తప్పదు. నా పార్థకోసం. నా అబ్బాయిని యిచ్చెయ్యాలి. అందరు తల్లులూ మొహాన వుమ్మేస్తారు కానినాపార్థ చేతులు నా చుట్టూ వుండకపోతే నాకు వొక్క నిమిషం విశ్రాంతి వుంటుందా? నేను పడుతున్న నరకబాధ అబ్బాయి కేం తెలుసు. యేడుస్తున్నా వాణ్ణి వొళ్ళో పెట్టుకుని; వూరికే కన్నీళ్ళు తుడుస్తాడు. చంపలు ముద్దు పెట్టుకుంటాడు; నవ్వుతాడు; నన్ను నవ్వించాలని చూస్తాడు.

'నాయనా? నీకు రేపు అమ్మే'దిరా. దిక్కుమాలిన అమ్మ తన సౌఖ్యంకోసం నిన్ను వొదులుకుంది. నాకెందుకు పుట్టావు. నా భాగ్యమా ఈ నిర్భాగ్యురాలికి" అన్నం పెట్టాను. ఒకటే నవ్వులు, గంతులు. అన్నం తినడు. పరిగెత్తుతాడు. చివరికి అలిసి నాచేతుల్లో రొమ్ముకి తల అనించుకొని నిద్రపోయినాడు. ఆఖరుసారి, నా జన్మకి ఆఖరుసారి నిద్రపోయినాడు. కఠినాత్మురాలిని మెల్లిగా చెయ్యి వొదిలించుకుని పక్కమీద పడుకోపెట్టా.

చెందనంబొమ్మ యింకా చేతులోనే వుంది. నవ్వితే వొచ్చినతడి చెంపనే వుంది. యేడుస్తో పార్థదగ్గిరికి వెళ్ళి,

"పార్థా! అబ్బాయిని వొదల్లేను. వొదిలి నేను బతకలేను" అని గోలపెట్టాను.

పాపం ఎంతో వోదార్చాడు. రాత్రి అంతా అట్లానే కూచుని యేడ్చాను. అయ్యో ఎంతబాధపడ్డాను. నక్షత్రాలు భయపడి నావంక చూశాయి, చిన్న చంద్రుడు అస్తమించాడు. చలిగాలి వేస్తోంది. తలుచుకుని తలుచుకుని ప్రతినిముషం వెక్కి వెక్కి యేడ్చాను, అబ్బాయికోసం. పక్కలో కూచుని మళ్ళీ కావిలించుకుని యేడ్చాను. నిద్రలో కదిలి, "అమ్మా! భయం" అన్నాడు. జోకొట్టాను. రేపు "అమ్మా భయ" మంటే ఎవరు పలుకుతారు! వీపంతా గుండెలంతా గునపంపెట్టి పొడుస్తున్నట్టుంది. అబ్బాయి చచ్చిపోతే తీరిపోను! బతికి వుండి అమ్మ అమ్మ, అని అన్నం తినక ఆ పాడుబడ్డ యిల్లు మూల మూల అమ్మేది? అని వెతుకుతూ వుంటే వూరిబైట నేనెట్లా బతుకుతానురా నాయనా?

తెల్లవారిపోయింది అబ్బాయిని ఇవ్వమని మనిషి వొచ్చాడు. నిద్ర పోతున్న అబ్బాయిని లేపాను యీ చేతులతో (వాటిని కాల్చినా ఆపాపం పోదు.) వాడికి అప్పచెప్పాను. గుప్పెటతో కళ్ళు నులుముకుంటో "ఎక్కయికి. అమ్మా? అమ్మా!" అన్నాడు; పలక్కపోతే తిరిగిచూసి నా వేపు చేతులుజాచి,

"అమ్మా అమ్మా" అని అరుస్తూ యేడ్చాడు. తాడిచెట్లలోంచి దూరంగా దూరంగా ఇంకా దూరంగా! నా బాబు గొంతుకు ఎవరో నొక్కినట్లు 'అమ్మా' అంటో వినపడ్డది. చచ్చిపోయినాను. ఆనాడే దెయ్యమైనాను, ఆ వుదయానే చీకటి పడ్డది. ఇంత కటికిదాన్ని గనకే నాకిన్ని దుఃఖాలు.

అబ్బాయి రాత్రి పడుకున్న పక్కగుడ్డమీద పడుకున్నాను. వాటిని మళ్ళీ మళ్ళీ కావిలించుకున్నాను. వాడివొంటి మధురమైన వాసన వాటికి అట్లానేవుంది. కాని అబ్బాయిని యెప్పటికీ వొదులుతున్నా ననుకోలేదు.

వాడు మూరాంపట్టి నాకోసం యేడపగానే, నాయుడుగారు నా దగ్గిరికి పంపేస్తారనే నిశ్చయం లోపలవుంది. అదే ఆఖరుసారి అబ్బాయిని ముద్దాడేది అనుకుంటే, నా కొడుకుగతి అట్లా అవుతుందంటే, పార్థనన్నా వొదిలేసి అబ్బాయితో వెళ్ళేదాన్ని కదూ?

అతను ఆ రాత్రి వెళ్ళి నాయుడుగారి దాసీదానితో మాట్లాడి యెప్పుడన్నా ఒకసారి అబ్బాయిని రాత్రిపడ్డతరవాత గుమ్మంలో నాకు చూపించేట్టు ఏర్పాటు చేశాడు.

# 18

మెల్లిగా దుఃఖం తగ్గింది.పార్థని చూస్తేచాలు అతనే నాకులోకం కాని అబ్బాయి యెట్లావున్నాడో, అమ్మా అని వెతుక్కుంటున్నాడేమో అని జ్ఞాపకమొచ్చి, కడుపులో కలియపెట్టినట్టయ్యేది. అన్నంతింటూ వుండగా జ్ఞాపకం వొస్తే ఇంక తిండి సయించేదికాదు. అంతే నిద్దట్లో "అమ్మా" అని వినపడి పులికిపడి, లేచేదాన్ని. రాత్రంతా చేతులు వుత్తవిగా లేకండా పార్థని రొమ్ముకి అదుముకుని కదలనీక పడుకోపెట్టుకునేదాన్ని. ఆఖరికి ఒకరోజు దాసీది చీకటి పడ్డ తరవాత నన్ను రమ్మన్నదిట. యెన్నో కొన్నాను. మిఠాయిలూ, బొమ్మలూ, అన్నీ చీకట్లో నడుస్తూవెళ్ళి అబ్బాయిని ఆడిస్తూ తీసుకొచ్చింది. నన్ను చూడగానే 'అమ్మా' అని మీదపడి బిగ్గిరిగా ఏడ్చాడు. 'బాబూ' అదేరా యీపాడు చెవులతో నేను విన్న ఆఖరిమాట అయిపోయింది. అదే ఆఖరుసారి సంతోషంతో నిన్ను కావిలించుకోడం, ఏడుపు విని ఇంట్లోంచి ఎవరో ఆడమనిషి "ఏమిటది" ఎందుకట్లా ఏడుస్తాడు? వెధవ! ఇట్లాయీడ్చుకురా" అన్నది· అంటే చప్పున దాసీచేతికిచ్చి నా బంగారాన్ని, చీకట్లోకి పోయినాను. అదెవర్తో నిన్నీడ్చుకు రమ్మంటే నోరెత్తే ధైర్యంలేక నా కంఠం పట్టుకుని, నా మొహం చీకట్లో ఆ కళ్ళతో వెతుకుతో వెళ్ళాడుతోవుంటే, నీ చిన్ని చేతుల్ని విడదీసి లాగేసి, ఆ దాసీదాని చేతికి ఎట్లా ఇచ్చాను నేను! అట్లాంటి రాక్షసిగనకే నాదగ్గిరి నించి వెళ్ళిపోయినావు నా భాగ్యమా! అమ్మ అట్లా వొక్క-

నిముషం కనపడి మాయమైతే యామనుకున్నావు బాబూ? అమ్మ దెయ్యమై వొచ్చిందనుకున్నావా? అవును! అమ్మేరా, నాయనా, నీ మృత్యువు!

"అమ్మ అమ్మ" అని ఏడుపు వినపడుతోనేవుంది. అదెవత్తోలోపల

"అమ్మకాదు, రిమ్మ. నోరుముయ్యి రాత్రింబవళ్ళు అమ్మా, అమ్మా అంటావు. నీ నోరు పడిపోనూ!.... ముండ, గుడిశేటి....దాని శ్రాద్ధం— అమ్మ—నీకో అమ్మ! ఈసారి అమ్మ అను" అంటోంది.

నోట్లో గుడ్డలు కుక్కుకుని.... బయిట వీధివెంబడి పరిగెత్తాను దొంగమల్లే.

ఇంక వెళ్ళి పార్థతో తగాదా పెట్టాను. అబ్బాయిని తీసుకుని ఎక్కడికో అడవుల్లోకి, కొండల్లోకి పారిపోదామంటూ. ఎక్కడున్నా పట్టుకుంటా రంటాడు. 'మరి అబ్బాయి నెప్పుడు చూడ్డం?" అంటే పెద్దవాడయింతర వాత నా దగ్గిరికి వొస్తాడంటాడు. పెద్దవాడయింతరవాత యెందుకు? ద్వేషం రాకుండా మానుతుందా?

ఈలోపున అమ్మ యెట్లాంటిదో చెప్పి మనసు విరపరూ. నన్ను చూస్తేనే అసయ్యించుకుంటాడు· వీల్లేదు. ఎత్తుకురమ్మన్నాను. తనని చిన్నప్పుడు ఒంటరిగా పారేసిపోయింది అమ్మ అని చెప్పితే అతనికి నామీద ద్వేషం రాకుండా మానుతుందా?

## 19

వారంరోజులు అయింది. మళ్ళీ అబ్బాయిని మరిచి పోతున్నాను. ఇంతలో దాసీవొచ్చి అబ్బాయికి చాలా జబ్బుగా వుందని పిడుగువంటి మాట వేసిపోయింది.

"పార్థా నేను వెడుతున్నా" నన్నాను.

"యెక్కడికి?"

"అబ్బాయి దగ్గిరికి."

"రానీరు"

"అక్కడే పడిచస్తా"

"నేనూ?"

"నాకు తెలీదు. వెడుతున్నా"

"నిజం?"

"నిజం"

"అయితే నేను వెళ్ళిపోనా?"

"ఎందుకు?" "నువ్వు వెళ్ళిపోతున్నావుగా? యెక్కడికో వెడతా ఇంకా నేనెందుకు ఇక్కడ?"

"పార్థా ఏం చెయ్యను?"

"నేనేం చెయ్యను?"

"నాకూ తెలీటంలా ఏం చెయ్యటానికీ. నేను వెళ్ళాలి. వెళ్లద్దూ వెళ్ళకుండా బతకలేను పార్థా"

నా ఆవేశం చూసేటప్పటికి పార్థకి కూడా వుండమనడానికి నోరు రాలేదు. అట్లానే చూస్తో నుంచున్నాడు, పాపం పార్థా! నిన్ను అట్లావొదిలి వెళ్ళిపోతే ఏమనుకున్నావు?

నాకు వొళ్ళు తెలీదు. నాకోసం దిగులుతో అబ్బాయి దిగులుపడ్డా డనేది ఒకటే ధ్యాస. పరిగెత్తుకునివెళ్ళి సరాసరి ఇంట్లో జొరబడ్డాను. నాయుడు "యెవరు నువ్వు? "పో" అన్నాడు."

"ఎట్లా వుంది" అన్నాను.

"పో" అన్నాడు.

కాళ్ళమీద పడ్డాను. నా జుట్టుతో కప్పేశా. కన్నీళ్ళతో తడిపా. "పాపాత్మురాల్ని! దిక్కుమాలినదాన్ని! దుమ్ములో కూలాను. ఇంకా తన్నకండి. అబ్బాయిని చూడనీండి. తరవాత నన్నురోడ్డుమీద పారెయ్యండి. నేను పోను, పోను, నాబిడ్డ! నా కడుపు! అయ్యో! నన్ను చంపెయ్యండి తరవాత. నా బాబుని బతికించుకోనీండి" అని యేడ్చాను "పో, లోపలికి పోయి చూడు యెంతకి తెచ్చావో!" అన్నాడు.

వెళ్ళాను. మంచం పక్కన చిన్నదీపం వెలుగుతోంది. సన్నని చేతులు, గుంటకళ్లు, శ్వాస, నా అబ్బాయి! నా చిన్నకూన! నా తల్లి లేని

పక్షి పడివున్నాడు. ఎవర్తో కూచునివుంది. నేను రాగానే కోపంగా లేచి పోయింది. చిక్కిపోయిన చెయ్యి పట్టుకుని ఏడ్చాను. నా వొళ్ళు తెలీదు. దాసీది వొస్తే అడిగాను.

ఆ మనిషి ఆయన మరదలట. పిలిపించాడు నాయుడు నాబాబుని పెంచడానికి. నా బాబుని కొట్టేది తలుచుకుని నాజుట్టు పీక్కుంటున్నా: నామొహం రక్కుకుంటున్నా, అయ్యోబాబూ నిన్నుకొడితే అమ్మని తలుచుకుని ఏడ్చావా? ఏమనుకున్నావు. నెప్పి పుడితే! తిండి వేళకి పెట్టేదికాదుట.

డాక్టరు బతకడన్నాడుట. నా గుండె జారింది. నిలువునా పడ్డాను. దాసీదాన్ని చేతులు పట్టుకుని బతిమాలుకున్నా, డాక్టరుని పిలుచుకునిరమ్మని యీ రాత్రి వొస్తాడా? నామెళ్ళో పుస్తెలనాను తెంచి దాసీ చేతులో పెట్టి యిది యిచ్చి తీసుకురమ్మన్నాను. వెళ్ళింది.

"బాబూ! ఒక్కసారి కళ్లు తెరిచిచూడు. అమ్మని క్షమించానను.

కదిలాడు, రొమ్మునోట్లో పెట్టాను, పిచ్చిగా,తాగలా. కొత్తగావును? లేకపోతే యింక యీ లోకంలో పాలు అక్కర్లేదో.... "అం అం అం" అన్నాడు.

"బాబూ! వొచ్చాను పార్దా! వొచ్చాను చూడు!" అన్నాను.

వినపడలేదు గావును కదల్లేదు. డాక్టరు వచ్చాడు-ఆయన బూడ్సుల మీద పడ్డాను.

"అయ్యా నా బిడ్డని బతికించండి. బతికినన్నాళ్లు మీదాసీ దాన్నవుతాను" అని యేడ్చాను.

మళ్ళీ అబ్బాయిని చూశాడు.

"అమ్మా! యేవడకు. నేనేం చెయ్యను! తెల్లవారిందాకా కూడా బతకడు" అన్నాడు. కిందపడి దొల్లి రాగాలు పెట్టాను. నన్ను చూసేదెవరు? వాణ్ని నాకు వొదిలి యెవరి దోవన వారు పోయినారు. మంచం మీద నా అబ్బాయి పక్కనే నేను తెల్లార్లూ కూచున్నా. అన్నీ జ్ఞాపకం వొచ్చాయి. నామీద యెంత ప్రేమ చూపించేవాడు? నోరెరుగనివాణ్ని, నేను తప్ప గతి లేనివాణ్ని, ఇట్లా చేతులారా గొంతు కోసుకున్నాను. నా చుట్టూ యెట్లా గంతులేశేవాడు! సముద్రంవలె పొంగి పొంగి నవ్వేవాడు! అయ్యో, యెట్లా

బితకను వాణ్ని యిట్లా చేసుకుని! యెట్లా చిక్కాడో? బుజాలదగ్గిర చిన్న బొమికలు కనబడుతున్నాయి.

ఒకరోజు రాత్రి పార్థ చేతుల్లో అలిసి పడుకుని నిద్రబోతున్నప్పుడు అబ్బాయి లేచి యేడ్చాడు. నిద్దట్లో లేచి కసురుకుని కొట్టబోయినాను. బుగ్గ నులిమాను ఏ కల వొచ్చి యేడ్చాడో! అమ్మ తనని వొదిలిపెట్టిందని కల వొచ్చిందేమో! ఆనాడే! గొడ్రాల్ని! అబ్బాయిని వొదిలేశాను. ఇప్పు డింత తలుచుకుని ఏడుస్తున్నాను. ఇంక యెన్నడూ అట్లాచెయ్యనని, రాత్రులన్నీ తనకోసం మేలుకుంటానని యెట్లానన్నా అబ్బాయికి చెప్పగలిగితే! ఒక్కసారి లేచి కళ్ళతో నన్ను చూసి పడుకోకూడదూ! అబ్బాయిచూస్తూవుండగా వాడి బుగ్గకి నెప్పి పుట్టించిన వేళ్ళని దీపంలో కాల్చాలనిపించింది. బుగ్గ యెర్రగా వుందిరా నాయినా. మర్నాడు తెల్లారి! ఆ ప్రేమ ఆ గుంత్రని బుగ్గలేవీ? ఆ నవ్వు, ఆ చూపు, ఆ దయ, ఇప్పుడు నాకేదీ! ఇంక యీ లోకంలో!

మూడింటికి వెక్కిళ్ళు పుట్టాయి. పాలుపిండి పోశా. కళ్ళు తెరిచి చుట్టూ గుడ్లు ఒక్కసారి తిప్పి నా మొహంమీద ఆపి "అమ్మా" అన్నాడు. గుర్తుపట్టావా? అమ్మ మళ్ళీ వొచ్చిందనుకున్నావా? నిన్ను విడిచి పోలేదనుకున్నావా? బాబూ, మళ్ళీ ఒక్కసారి పెదివలు కదిలించు. చేతులో యెత్తుకుని రొమ్ము కదుముకోవాలని యెంతో అనిపించింది. అంతే గుడ్లు తిరిగి పోయినాయి, వూపిరాగింది. అంతే. అంతే. అరిచి కింద పడ్డాను "బాబూ ఏమైనావు? యెక్కడికి వెళ్ళావు?"

"అమ్మమీద కోపమే? వెళ్ళిపోయిందని, అమ్మ నిన్ను వొదిలి వేసిందని. జాలిపడి దేవుడు పిలిస్తే వెళ్ళావా? భూమిమీద నీకు దిక్కే లేకపోయిందా? ఇంక యెన్నడూ వొదలను. వొక్కసారి రావూ? రావూ? నిర్భాగ్యురాలిని నా దగ్గిర నువ్వెందుకుంటావు?"

వెనకాల యెవరో చెయ్యి వేశారు. తిరిగి చూశాను.

పార్థా! పార్థా! మన అబ్బాయి!

★